


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## ఆమె పాటలు ఎప్పటికీ ప్రతిధ్వనిస్తాయి:




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 103 | సోమవారం 13 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3


# చర్మవ్యాధుల రంగంలో నకిలీ వైద్యులు



వారి చికిత్సలతో రోగులకు ప్రాణసంకటం

'ఫేక్'ల ఏరివేతకు దేశవ్యాప్తంగా ఉద్యమం

యాంటీ క్వాకరీ కమిటీ చైర్‌పర్సన్ రజిత వెల్లడి



# 'క్వాంటమ్'తో భవిష్యత్తు భేష్!

ప్రకృతి విపత్తులకు చక్కని పరిష్కారం

అంతుచిక్కని సమస్యలను తీర్చే మార్గం

మానవాళి మనుగడకు దివ్యౌషధం

రేపు క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీ ప్రారంభం

ప్రపంచం ముందుకు స్వదేశీ క్వాంటమ్ కంప్యూటర్

గ్లోబల్ లీడర్‌గా అమరావతి క్వాంటమ్ వ్యాలీ

## దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్...



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టెక్నాలజీ రంగంలో ఒక చారిత్రక ఘట్టానికి సిద్ధమవుతోంది. భారతదేశంలోనే మొట్టమొదటి దేశీయ, ఓపెన్-యాక్సెస్ క్వాంటం కంప్యూటర్లను అమరావతిలో ఆవిష్కరించనున్నారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్

## 'వెట్రి తమిళనాడు సూపర్ యాప్'.. ఏఐతో పాలన అందిస్తాం:



తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్.. డీఎంకే ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కన్యాకుమారి జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ అధికారంలోకి వస్తే అందించబోయే పాలనా నమూనాను ప్రజల ముందుంచారు. అవినీతికి ఆస్కారం లేకుండా,

## భారత్ తో భయంకరమైన యుద్ధాన్ని ఆపడం పట్ల పాక్ ఇప్పటికీ కృతజ్ఞతలు చెబుతోంది:



భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన పూర్తిస్థాయి యుద్ధాన్ని తాను ఆపడం వల్లే దాదాపు 5 కోట్ల మంది ప్రాణాలు నిలిచాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తాజా 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ (రూఖ 2026)' ప్రసంగంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తూ, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో తన

## ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరం: పవన్ కల్యాణ్



ప్రముఖ గాయని, లెజెండరీ సింగర్ శ్రీమతి ఆశా భోంస్లే మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సినిమాలో ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరమని, ఆమె లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "హిందీతో పాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ సహా అనేక భాషలలో కొన్ని దశాబ్దాల పాటు ఆశా భోంస్లే గారు లెక్కలేనన్ని చిరస్మరణీయ గీతాలను ఆలపించారు. శాస్త్రీయ, పాశ్చాత్య, సమకాలీన సంగీత శైలులలో ఆమె చూపిన అసాధారణమైన బహుముఖ ప్రజ్ఞ అన్ని తరాల సంగీత ప్రియుల మన్ననలను పొందింది" అని కొనియాడారు. "దమ్ మారో దమ్", "చురాలియా హై తుమ్నే", "ఇన్ ఆంఖోం కీ మస్తీ", "రాధా కైసే నా జలే" వంటి ఆమె పాటలు ఎప్పటికీ నిలిచిపోతాయని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలుగు సినిమాలలో ఆమె పాడిన పాటలు తక్కువే అయినా, హిందీ సంగీతం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆమె ఎంతో ఆదరణ పొందారని తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.



# 'వర్క్ ఫ్రం హోం పాలిటిక్స్'..

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతున్న తరుణంలో, నటుడు, తమిళగ వెట్రి కజగం(టీవీకే) అధినేత విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముందుగా ఖరారైన పలు బహిరంగ సభలను ఆయన అకస్మాత్తుగా రద్దు చేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయంపై అధికార డీఎంకే 'వర్క్ ఫ్రమ్ హోమ్' రాజకీయమంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. రాష్ట్రవ్యాప్తంగా జరగాల్సిన కీలకమైన ర్యాలీలు, సభలను విజయ్ రద్దు చేస్తున్నట్టు టీవీకే వర్గాలు తెలిపాయి. అయితే, ఈ నిర్ణయానికి కచ్చితమైన కారణాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. ప్రచార వ్యూహంలో మార్పులు చేయడం లేదా భద్రతాపరమైన అంశాలు దీనికి కారణమై ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ నిర్ణయంపై అధికార డీఎంకే పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఎన్నికల సమయంలో ప్రజల మధ్య ఉండాల్సింది పోయి, ఇలా సభలు రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించింది. విజయ్ క్షేత్రస్థాయిలో తిరగకుండా 'వర్క్ ఫ్రమ్ హోమ్' పాలిటిక్స్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేసింది. మరోవైపు, అధినేత పర్యటనలు ఆగిపోవడంతో టీవీకే కార్యకర్తలు, అభిమానులు కొంత నిరాశకు గురయ్యారు. అయితే, విజయ్ సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు చేరువవుతారని పార్టీ నాయకులు చెబుతున్నారు.

డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు పోటీగా తమిళనాడులో మూడో ప్రత్యామ్నాయంగా నిలవాలని టీవీకే లక్ష్యంగా పెట్టుకుంది. ఇలాంటి కీలక సమయంలో విజయ్ ప్రచార సభలను రద్దు చేసుకోవడం ఆయన వ్యూహంపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## "జగన్ పోకడలు భరించలేం.. అతన్ని బెంగళూరులోనే ఉంచండి"



వైసీపీ అధినేత జగన్ రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదంతో సాగుతున్నాయని, ఆయన 'గొడ్డలి రాజకీయం' రాష్ట్రానికి పెను ప్రమాదంగా పరిణమించిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నరుకుతాం, చంపేస్తాం" అనే నీచమైన భాషతో రాజకీయాలు చేస్తూ, విధ్వంసాన్నే తమ అజెండాగా వైసీపీ మార్చుకుందని ఆయన విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ రెడ్డి తన హిడెన్ అజెండాను ఇప్పుడు బహిరంగంగానే ప్రకటిస్తున్నారని అన్నారు. అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేలా వారి తీరు ఉందని మండిపడ్డారు.

## బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్ అవుతోందా?..

ఆసక్తి రేపుతున్న కేటీఆర్ వ్యాఖ్యలు



## ఇరాన్‌తో శాంతి చర్చలు విఫలం..

ఇక మిగిలింది కూడా ముగించేస్తా మన్న ట్రంప్



## తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల



# "జగన్ పోకడలు భరించలేం.. అతన్ని బెంగళూరులోనే ఉంచండి"

ఉగ్రవాదం కన్నా ప్రమాదకరం

రాజకీయ పార్టీలు ప్రజలకు మేలు చేస్తామని చెప్పాలి కానీ, వైసీపీ మాత్రం తాము అధికారంలోకి వస్తే ఉన్నవి పడగొడతామని, పనులు ఆపేస్తామని, యువతను చెడగొడతామని చెబుతోందని నిమ్మల ఎద్దేవా చేశారు. వైసీపీ 'యూత్ పాలసీ' అంటే మద్యం వ్యాపారాలు చేయడం, కొత్త మాదక ద్రవ్యాలు తెచ్చి యువత భవిష్యత్తును నాశనం చేయడమేనా? అని ప్రశ్నించారు."గుంటూరు ఇవతల లాగి కొడతాం, అవతల నరుకుతాం" అని బాహాటంగా హెచ్చరిస్తూ, తల్లులకు పుత్రశోకం మిగిల్చడానికే వైసీపీ నేతలు అధికార దాహంతో ఉన్నారని ఆరోపించారు. జంతువులను నరికి ఆ రక్తాన్ని ఫ్లెక్సీలపై చల్లుతూ రాక్షసానందం పొందేవారు ప్రజలకు ఏం మేలు చేస్తారని నిలదీశారు. వాస్తవాలు రాస్తున్న మీడియా సంస్థల నాలుకలు కోస్తామని బెదిరించడం రాజ్యాంగం కల్పించిన ఫోర్త్ ఎస్టేట్ గొంతు నొక్కడమేనని అన్నారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకుండా మరింత ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.వివేకా హత్యపై ప్రశ్నల వర్షం వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ మంత్రి నిమ్మల, జగన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. "రాజకీయాల కోసం సొంత బాబాయ్‌నే గొడ్డలితో వేటు వేసిన చరిత్ర జగన్‌ది. వివాదరహితుడైన వివేకాను ఎంపీ పదవికి రాజీనామా చేయాలని బెదిరించినప్పుడు, నాడు సోనియా గాంధీ మిమ్మల్ని మందలించింది నిజం కాదా?" అని ప్రశ్నించారు.

వివేకా గొడ్డలిపోటుతో చనిపోతే, దాన్ని 'గుండెపోటు'గా సాక్షి మీడియాలో ఎందుకు ప్రచారం చేశారని నిలదీశారు. సొంత చిన్నాన్న హత్యకు గురైతే 12 గంటలు ఆలస్యంగా వచ్చి సాక్ష్యాలు చెరిపేయడంలో ఎందుకు నిమగ్నమయ్యారని అడిగారు. ప్రపంచంలో ఎక్కడైనా హత్యకు గురైన వ్యక్తికి కుట్లు వేసి కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తారా? అని మండిపడ్డారు. పరిటాల రవి హత్య కేసులో సాక్షులు మాయమైనట్లే, నేడు వివేకా హత్య కేసులోనూ సాక్షులను మాయం చేస్తున్నారని, దీనికి జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కుటుంబ సభ్యుల పట్ల వైఖరి ఇదేనా?**జగన్ రెడ్డి తన కుటుంబ సభ్యుల పట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలంతా చూశారని నిమ్మల అన్నారు. "నా తల్లి, నా చెల్లి" అంటూనే వారిని ఇంటి నుంచి బయటకు గెంటారని ఆరోపించారు. ఇప్పుడు రాష్ట్రంలోని మహిళలకు మేలు చేస్తానని చెప్పడం నయవంచన కాదా? అని ప్రశ్నించారు. నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించి, ఆయన ఆచూకీ కూడా తెలియని సమయంలో సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి కావాలని చూడటం జగన్ వికృత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు. "జగన్ రాకను తండ్రి రాజశేఖర్ రెడ్డి గారే ఇష్టపడలేదు. మీరు చెప్పి అతన్ని బెంగళూరులోనే ఉండమనండి" అని స్వయంగా విజయమ్మ గారే నాడు రోశయ్య గారికి ఫోన్ చేసి వేడుకున్నారని, దీన్నిబట్టి జగన్ నైజం అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

రంగా గారి పేరు ఎత్తే అర్హత లేదు

వంగవీటి రంగా గారి గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని నిమ్మల రామానాయుడు ఘాటుగా విమర్శించారు. "రంగా గారి హంతకులను అక్కున చేర్చుకున్న చరిత్ర జగన్‌ది. రంగా హత్య కేసులో ప్రధాన నిందితుడి కుమారుడు ఈరోజు ఏ పార్టీలో ఉన్నాడో జగన్ చెప్పాలి. హంతక కుటుంబానికి హైదరాబాద్‌లో కోట్ల విలువైన భూమిని ఎందుకు గిఫ్ట్‌గా ఇచ్చారు?" అని ప్రశ్నించారు. రంగా గారిని 'రౌడీ' అని అవమానించిన గౌతమ్ రెడ్డికి ఫైబర్ గ్రిడ్ ఛైర్మన్ పదవి ఇచ్చి సత్కరించడం, రంగా గారిపై జగన్‌కు ఉన్న విద్వేషానికి నిదర్శనమని అన్నారు. హంతక కుటుంబాలతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ రంగా పేరు ఎత్తడానికి సిగ్గుండాలని మండిపడ్డారు.

గొడ్డలి పార్టీకి రాజకీయ సమాధి నాడు తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆర్థిక ఉగ్రవాదిగా మారిన జగన్, నేడు రాజకీయ ఉగ్రవాదిగా మారి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని నిమ్మల ఆరోపించారు. 2019-24 మధ్య వైసీపీ పాలనతో జరిగిన నష్టం, రాష్ట్ర విభజన నష్టం కన్నా ఎక్కువని అన్నారు. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ పట్టాలెక్కిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతుంటే, మళ్లీ విధ్వంసం సృష్టించాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ జెండాను పక్కనపెట్టి 'గొడ్డలి'ని జెండాగా చేసుకున్న ఈ 'గొడ్డలి పార్టీ'కి ప్రజలు రాజకీయ సమాధి కట్టాలని, ఇలాంటి ఉన్మాద పార్టీని రాష్ట్రం నుంచి శాశ్వతంగా తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్ అవుతోందా?..

బీఆర్ఎస్ పార్టీ పేరును తిరిగి టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి)గా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోబోమని, ఒంటరిగానే పోటీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో జరిగిన ఓ కార్యక్రమం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ కొన్ని పొరపాట్లు చేసిందని కేటీఆర్ అంగీకరించారు. ఈ తప్పుల కారణంగా ప్రజలకు, పార్టీ నాయకులకు మధ్య కొంత దూరం పెరిగిందని, దీనిపై తాము పూర్తిస్థాయిలో అధ్యయనం చేశామని తెలిపారు. గుర్తించిన లోపాలను సరిదిద్దుకుని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. "చంద్రుడిపై కొన్ని మబ్బులు కమ్మినంత మాత్రాన చంద్రుడు కనుమరుగు కాడు. ఆ మబ్బులు తొలగి మళ్లీ ప్రకాశిస్తాడు. బీఆర్ఎస్ కూడా తాత్కాలికంగా వెనుకబడ్డా తిరిగి పుంజుకుని అధికారంలోకి వస్తుంది. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందని, మేధావులు మౌనంగా ఉంటున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రలో ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు, కేసీఆర్ గొప్ప ముఖ్యమంత్రులుగా నిలిచారని ప్రస్తావించారు. ప్రస్తుతం కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీ పేరు మార్పు ఆలోచన, భవిష్యత్ వ్యూహాలపై విశ్లేషణలు మొదలయ్యాయి.

## ఇరాన్‌తో శాంతి చర్చలు విఫలం..

ఇరాన్-అమెరికా మధ్య పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో జరిగిన కీలక చర్చలు విఫలమయ్యాయి. ఈ పరిణామంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసే సంచలన నిర్ణయం తీసుకున్నారు. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తక్షణమే దిగ్బంధించాలని అమెరికా నౌకాదళాన్ని ఆదేశించినట్లు ప్రకటించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్ ను చాలా వరకు నాశనం చేశామని... ఆ దేశానికి చెందిన నేవీ, సైన్యం, ఇతర బలగాలు దెబ్బతిన్నాయని, ఇక మిగిలి ఉన్న కొంచెం భాగాన్ని కూడా తమ సైన్యం ముగించేస్తుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ పాల్గొన్నారు. చర్చల వివరాలను వారు తనకు పూర్తిగా వివరించారని ట్రంప్ తెలిపారు. "చర్చలు బాగానే జరిగాయి, చాలా అంశాలపై ఏకాభిప్రాయం కుదిరింది. కానీ నిజంగా ముఖ్యమైన ఏకైక అంశం, అణు కార్యక్రమంపై మాత్రం ఒప్పందం కుదరలేదు. ఇరాన్ తన అణు ఆకాంక్షలను వదులుకోవడానికి ఇష్టపడటం లేదు! ఆ అంశం చర్చకు వచ్చేసరికి ఇరాన్ మొండికేసింది" అని ట్రంప్ తన పోస్టులో విమర్శించారు. ఇరాన్ తన అణు ఆశయాలను వదులుకోవడానికి సిద్ధంగా లేదని, అస్థిరమైన వ్యక్తుల చేతిలో అణ్వాయుధాలు ఉండటాన్ని అనుమతించలేమని స్పష్టం చేశారు. 'ఇరాన్‌కు అణ్వస్త్రం ఎప్పటికీ దక్కదు' అని ఆయన తేల్చిచెప్పారు.చర్చల వైఫల్యం నేపథ్యంలోనే ట్రంప్ కఠిన నిర్ణయం తీసుకున్నారు. "హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించడానికి లేదా బయటకు వెళ్లడానికి ప్రయత్నించే ఏ నౌకనైనా, అన్ని నౌకలను దిగ్బంధించడం ప్రారంభించాలని నేను మా నౌకాదళాన్ని ఆదేశించాను. త్వరలోనే దిగ్బంధనం ప్రారంభమవుతుంది," అని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, జలసంధిలో ఇరాన్ అమర్చిన మైన్లను ధ్వంసం చేయాలని, ఇరాన్‌కు అక్రమంగా టోల్ చెల్లించిన ప్రతి ఓడను అంతర్జాతీయ జలాల్లో అడ్డగించాలని కూడా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. "మాపై గానీ, శాంతియుతంగా వెళుతున్న నౌకలపై గానీ కాల్పులు జరిపిన ఏ ఇరానియన్‌ను అయినా నరకానికి పంపుతాం!" అని ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని గతంలో వాగ్దానం చేసి, ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే విఫలమైందని ట్రంప్ ఆరోపించారు. ప్రపంచంలోని ఐదో వంతు చమురు, గ్యాస్ రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా నిర్ణయంతో అంతర్జాతీయ వాణిజ్యంపై మరోసారి తీవ్ర ప్రభావం పడుతుందని, ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది.

## టీసీఎస్ నాసిక్ యూనిట్‌లో లైంగిక వేధింపుల కలకలం.. ఉద్యోగులపై వేటు, సిట్ దర్యాప్తు

దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ యూనిట్‌లో వెలుగుచూసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసు తీవ్ర రూపం దాల్చింది. ఈ వ్యవహారంలో దర్యాప్తు ఎదుర్కొంటున్న ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు ఆదివారం కంపెనీ ప్రకటించింది. వేధింపులు, బలవంతపు చర్యల పట్ల తమ సంస్థ జీరో-టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తునకు తాము పూర్తిగా సహకరిస్తున్నామని, విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని టీసీఎస్ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది మార్చిలో ఈ వివాదం మొదలైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన సహోద్యోగి ఒకరు శారీరక సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు మరిన్ని దిగ్భ్రాంతికర విషయాలు తెలిశాయి. ఇదే తరహాలో వేధింపులకు గురైన మరికొందరు బాధితులు ముందుకు రావడంతో, ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

## తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ముఖ్య గమనిక. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, 2026 మే/జూన్ కు సంబంధించిన టైమ్‌టేబుల్‌ను తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు (౧+దీ×జు) విడుదల చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సులకు చెందిన ఫస్టియర్, సెకండియర్ విద్యార్థుల కోసం ఈ షెడ్యూల్‌ను ప్రకటించింది. థియరీ పరీక్షలు మే 13వ తేదీ నుంచి ప్రారంభమై మే 21వ తేదీన ముగుస్తాయి. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలను మే 22 నుంచి 25 వరకు రెండు సెషన్లలో (ఉదయం 9-12, మధ్యాహ్నం 2-5) నిర్వహిస్తారు. మే 26న ఇంగ్లీష్ ప్రాక్టికల్, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షలు, మే 28న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జరగనుంది.

**థియరీ పరీక్షల పూర్తి షెడ్యూల్:**

మే 13 (బుధవారం): సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 (ఫస్టియర్); సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 (సెకండియర్)

మే 14 (గురువారం): ఇంగ్లీష్ పేపర్-1 (ఫస్టియర్); ఇంగ్లీష్ పేపర్-2 (సెకండియర్)

మే 15 (శుక్రవారం): మ్యాథ్స్-1ూ, బోటనీ-1, పొలిటికల్ సైన్స్-1 (ఫస్టియర్); మ్యాథ్స్-2ూ, బోటనీ-2, పొలిటికల్ సైన్స్-2 (సెకండియర్)

మే 16 (శనివారం): మ్యాథ్స్-1దీ, జువాలజీ-1, హిస్టరీ-1 (ఫస్టియర్); మ్యాథ్స్-2దీ, జువాలజీ-2, హిస్టరీ-2 (సెకండియర్)

మే 18 (సోమవారం): ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 (ఫస్టియర్); ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2 (సెకండియర్)

మే 19 (మంగళవారం): కెమిస్ట్రీ-1, కామర్స్-1 (ఫస్టియర్); కెమిస్ట్రీ-2, కామర్స్-2 (సెకండియర్)

మే 20 (బుధవారం): పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్-1 (ఫస్టియర్); పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్-2 (సెకండియర్)

మే 21 (గురువారం): మోడరన్ లాంగ్వేజ్-1, జాగ్రఫీ-1 (ఫస్టియర్); మోడరన్ లాంగ్వేజ్-2, జాగ్రఫీ-2 (సెకండియర్) ఈ తేదీలు ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు కూడా వర్తిస్తాయని, అయితే వారికి సంబంధించిన పూర్తి టైమ్‌టేబుల్‌ను ప్రత్యేకంగా విడుదల చేస్తామని బోర్డు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆమె పాటలు ఎప్పటికీ ప్రతిధ్వనిస్తాయి: ఆశా భోంస్లే మృతిపై ప్రధాని మోదీ స్పందన

ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. భారతదేశం చూసిన అత్యంత ప్రసిద్ధ, బహుముఖ ప్రజ్ఞావంతురాలైన గాయకులలో ఆశా భోంస్లే ఒకరని మోదీ కొనియాడారు. "భారతదేశం గర్వించదగ్గ బహుముఖ ప్రజ్ఞాశాలి, దిగ్గజ గాయకులలో ఒకరైన ఆశా భోంస్లే గారి మరణ వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది.దశాబ్దాల పాటు సాగిన ఆమె అసాధారణ సంగీత ప్రస్థానం మన సాంస్కృతిక వారసత్వాన్ని సుసంపన్నం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది హృదయాలను ఆమె తన గానంతో స్పృశించారు. ఆర్ద్రతతో కూడిన మెలోడీలు అయినా, ఉత్సాహభరితమైన గీతాలైనా, ఆమె గొంతులో కాలాతీతమైన ప్రతిభ దాగి ఉంది.ఆమెతో నాకున్న పరిచయాన్ని, సంభాషణలను నేను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రియులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆమె రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారు. ఆమె పాటలు ప్రజల జీవితాల్లో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి" అంటూ ప్రధాని తన ట్వీట్ లో కీర్తించారు.

## వైజాగ్ లో ఐబీఎం.. ఫొటో షేర్ చేసిన మంత్రి నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ ఐబీఎం (×దీవీ) విశాఖపట్నంలో తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ మేరకు వైజాగ్ లో ఐబీఎం సంస్థ బోర్డు తాలూకు ఫొటోను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఐబీఎంకు వైజాగ్ తరఫున స్వాగతం అంటూ పోస్టు చేశారు. ఐబీఎం రాకతో విశాఖ ఐటీ స్వరూపం మరింత బలోపేతం అవుతుందని ఆయన గతంలో పేర్కొన్నా సంగతి తెలిసిందే. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత ఐబీఎం తిరిగి విశాఖకు వస్తోంది. ఇందుకోసం సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ర్యూ×)లో ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తన కార్యకలాపాల కోసం ఇప్పటికే నమోదు చేసుకుంది. ఈ కేంద్రం ద్వారా తొలుత 500 మందికి పైగా ఉద్యోగులకు ఉపాధి లభించనుంది. రాబోయే మూడేళ్లలో సుమారు రూ. 321 కోట్ల విలువైన ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. గత జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్.. ఐబీఎం సీఈవో అరవింద్ కృష్ణతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఆ చర్చల ఫలితంగానే ఇప్పుడు ఐబీఎం విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకొచ్చినట్లు తెలుస్తోంది.

గతంలో మధురవాడ ఐటీ సెజ్‌లో ఐబీఎంకు కార్యాలయం ఉండేది. ఇప్పుడు మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా విశాఖను కీలక ఐటీ గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు మరింత బలం చేకూరింది.

## చర్మవ్యాధుల రంగంలో నకిలీ వైద్యులు

చర్మవ్యాధుల వైద్య రంగంలో సరైన అర్హతలు లేని నకిలీ వైద్యుల చికిత్సలు రోగులకు ప్రాణసంకటంగా మారుతున్నాయని జాతీయ చర్మవ్యాధుల వైద్య నిపుణుల సంఘం (ఐఏడీవీఎల్) తెలంగాణ ప్రెసిడెంట్ ఎలెక్ట్, యాంటీ క్వాకరీ కమిటీ నేషనల్ చైర్‌పర్సన్ డాక్టర్ రజిత దామిశెట్టి ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ వైద్యుల ఆట కట్టించేందుకు ఐఏడీవీఎల్ యాంటీ క్వాకరీ కమిటీలతో దేశవ్యాప్తంగా ఉద్యమ స్థాయి పోరాటానికి దిగినట్లు పేర్కొన్నారు. గుంటూరులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో ఆదివారం 'ఏఐ ఇన్ డెర్మటాలజీ, యాంటీ క్వాకరీ' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఓ దంత వైద్యురాలు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చేయగా.. ఇద్దరు వ్యక్తులు మత్తు మందు ఎక్కువై మరణించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో దంత వైద్యులు స్కిన్ క్లినిక్‌లను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పదో తరగతి అర్హతగా కాస్మోటాలజీ కోర్సులు, సౌందర్య చికిత్సలపై ఆన్‌లైన్ కోర్సులు చేస్తున్న పలువురు.. చర్మ సంబంధిత చికిత్సలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ఆస్పత్రుల్లో ఇతర స్పెషాలిటీ వైద్యులు డెర్మటాలజీ వైద్యుల సర్టిఫికెట్లు సమర్పించి, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి చికిత్సలు చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో ఒకే డెర్మటాలజిస్టు నాలుగు క్లినిక్‌లకు తన డీవీఎల్ సర్టిఫికెట్‌ను అద్దెకు ఇచ్చిన విషయాన్ని గుర్తించామని చెప్పారు. ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడొద్దని క్వాలిఫైడ్ డెర్మటాలజిస్టులను ఆమె కోరారు. ఐఏడీవీఎల్ నేషనల్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ కేఏ సీతారామ్ మాట్లాడుతూ నకిలీ వైద్యుల వివరాలను సభ్యులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐఏడీవీఎల్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ సీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చర్మవ్యాధుల వైద్య రంగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక పాత్ర పోషించనున్నట్లు చెప్పారు.

## 'క్వాంటమ్'తో భవిష్యత్తు భేష్!

భవిష్యత్‌కు భరోసానిచ్చే క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలకు అమరావతి క్వాంటమ్ వ్యాలీ వేదిక కానుంది. క్వాంటమ్ కంప్యూటర్ ప్రకృతి విపత్తులకు పరిష్కారం చూపుతుందని ఈ రంగంలో నిష్ణాతులు చెబుతున్నారు. కరోనా సమయంలో క్వాంటమ్ కంప్యూటింగ్ అందుబాబులో ఉండిఉంటే.. ఆ మహమ్మారిని అంతమొందించే పరిష్కారం చిటికెలో దొరికేదని చెబుతున్నారు. జీవన ప్రమాణాలను పెంచడంలో క్వాంటమ్ కంప్యూటర్ అద్భుతంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. రోగాలకు కారణాలను లిప్తపాటులో గుర్తించి వాటిని నివారించే ఔషధాల తయారీకి సహకరిస్తుందని, మానవాళి మనుగడకు దివ్యౌషధంలా మారుతుందని చెబుతున్నారు. ఈ నెల 14న ప్రపంచ క్వాంటమ్ కంప్యూటర్ దినోత్సవం సందర్భంగా... క్వాంటమ్ రిఫరెన్సు ఫెసిలిటీ సెంటర్ ఇక్కడ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. క్వాంటమ్ కంప్యూటర్లు తయారు కావాలంటే టెస్ట్ బెడ్‌లు కావాలి. వాటినే రిఫరెన్స్ ఫెసిలిటీస్ అంటారు. భారత్‌లో ఇప్పటివరకూ అవి ఎక్కడా లేవు. దేశంలోనే తొలిసారిగా అమరావతిలోనే ప్రారంభం కానున్నాయి. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, గన్నవరంలోని మేధా టవర్స్‌లో ఏర్పాటు చేస్తున్న దేశంలోని మొట్టమొదటి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ప్రారంభించనున్నారు.

**ప్రముఖ సంస్థల తోడ్పాటుతో..** ఎస్ఆర్ఎంలో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ కంప్యూటర్‌ను క్యూబిట్ ఫోర్స్ సంస్థ అధిపతి ఎల్. వెంకట సుబ్రహ్మణ్యంరూపొందించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో డాక్టరేట్ చేసిన వెంకట్‌కు క్వాంటమ్ కంప్యూటింగ్‌లో అపార అనుభవం ఉంది. ప్రస్తుతం క్వాంటమ్ ఇండియా లీడర్ సంస్థకు సేవలందిస్తున్నారు. ఐబీఎం మాస్టర్ ఇన్వెంటర్‌గా ప్రఖ్యాతిగాంచిన వెంకట్.. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్‌లో సేవలందించాలని కోరిన వెంటనే ఆ దిశగా ఆలోచన చేశారు. దేశంలోని ప్రఖ్యాత సంస్థల తోడ్పాటుతో స్వదేశీ క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారు చేశారు. దీనికోసం రూ.14కోట్ల దాకా వ్యయం అయినట్టు వెంకట్ వెల్లడించారు. మరోవైపు క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్‌కు చెందిన పినాక పృథ్వీ మెకానికల్ ఇంజనీరింగ్ చేశారు. హార్డ్‌వేర్ రంగంలోని పరిజ్ఞానంతో క్వాంటమ్ కంప్యూటింగ్ తయారీ, నిర్వహణపై దృష్టిసారించారు. క్యూబిటెక్ రూపొందించిన ఈ క్వాంటమ్ కంప్యూటర్‌ను గన్నవరం మేధా టవర్స్ వద్ద పరిశోధనా సౌలభ్యం కోసం ఉంచారు. క్వాంటమ్ కంప్యూటర్ అందుబాటులోకి వస్తే.. వైద్యరంగంలో పరిశోధనలు చేసేందుకు.. పరిష్కార మార్గాలు గుర్తించేందుకు ఉపయోగపడుతుందని నేషనల్ క్వాంటమ్ మిషన్ సభ్యుడు, సీనియర్ శాస్త్రవేత్త ప్రవీణ్ కుమార్ తెలిపారు. సంప్రదాయ కంప్యూటర్లతో పోలిస్తే దీని పనితీరు వేరుగా ఉంటుందన్నారు. రూ.14కోట్లతోనే క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారుచేసిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ కి అప్పుడే విదేశాల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. ఆ టెక్నాలజీ తమకు కావాలంటూ జర్మనీ తదితర దేశాలు కోరుతున్నాయని సాంకేతిక రంగ నిపుణుడు ఒకరు వివరించారు.

## దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్...

వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కీలక వివరాలు పంచుకున్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'అమరావతి 1ూ', 'అమరావతి 1ు' పేరుతో ఈ క్వాంటం కంప్యూటర్లను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా, ఒక గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. "భారత్‌లో తయారై, భారతీయులకు అందుబాటులో ఉంటూ, ప్రపంచానికి సేవలు అందించడమే" తమ ధ్యేయమని ఆయన వివరించారు. ఈ పరిణామంతో దేశ క్వాంటం భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని, భవిష్యత్ టెక్నాలజీ అమరావతి నుంచే మొదలవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణతో క్వాంటం కంప్యూటింగ్ రంగంలో ఏపీ కీలక పాత్ర పోషించనుంది.

## 'వెట్రి తమిళనాడు సూపర్ యాప్'.. ఏఐతో పాలన అందిస్తాం:

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. మహాధనపురంలో జరిగిన సభలో విజయ్ మాట్లాడుతూ.. "ప్రజలు తమకు హక్కుగా రావాల్సిన పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన పనిలేదు, లంచాలు ఇవ్వాల్సిన అవసరం అంతకన్నా లేదు. ప్రభుత్వ పథకాలే నేరుగా మీ ఇంటి తలుపు తడతాయి" అని స్పష్టం చేశారు. దీనికోసం తమిళనాడులోని ప్రతి కుటుంబానికి ఆధార్ తరహాలో 'ప్రయారిటీ కార్డ్' జారీ చేస్తామన్నారు. ఈ కార్డులో కుటుంబ సమగ్ర సమాచారం ఉంటుందని, తద్వారా పుట్టినప్పటి నుంచి అన్ని సంక్షేమ ఫలాలు సజావుగా అందుతాయని వివరించారు.ప్రస్తుత ప్రభుత్వంలో అవినీతి తీవ్రస్థాయిలో ఉందని, కింది స్థాయి అధికారుల నుంచి మంత్రుల వరకు లంచాలు వెళ్తున్నాయని విజయ్ ఆరోపించారు. తాను చెప్పేవి కట్టుకథలు కావని, సాంకేతికతతో శాస్త్రీయంగా అమలు చేయగల ప్రణాళికలని స్టాలిన్‌ను ఉద్దేశించి అన్నారు. టీవీకే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 'తమిళనాడు ప్రభుత్వ సేవా పథకం' అమలు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ సేవలన్నింటినీ ఒకేచోట అందించేందుకు 'వెట్రి తమిళనాడు సూపర్ యాప్' అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను తీసుకొస్తామన్నారు. పాలనలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేస్తామని, 10 లక్షల మంది మద్దతిచ్చిన ప్రజా వినతులను అసెంబ్లీలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అప్పు రూ.10.05 లక్షల కోట్లు దాటిందని ఆందోళన వ్యక్తం చేసిన విజయ్, పన్నులు పెంచకుండానే ఆదాయాన్ని పెంచుతామని తెలిపారు. టీవీకే ప్రభుత్వం వస్తే తమిళనాడును దేశానికే ఏఐ, డిజిటల్ రాజధానిగా మార్చి, ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

## భారత్ తో భయంకరమైన యుద్ధాన్ని ఆపడం పట్ల పాక్ ఇప్పటికీ కృతజ్ఞతలు చెబుతోంది:

పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. పాకిస్థాన్ నాయకులు తనకు నిరంతరం కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన చెప్పుకొచ్చారు. గతేడాది (2025) కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది భారతీయులు మరణించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించింది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరి, అణు యుద్ధం ముంగిట నిలిచాయని ట్రంప్ వివరించారు. ఆ క్లిష్ట సమయంలో తాను జోక్యం చేసుకోకపోతే పెను విధ్వంసం జరిగి ఉండేదని అన్నారు. "భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధం జరిగి ఉండేది. దానివల్ల 3 నుంచి 5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయేవారు. 'మీరు లేకపోతే నేను సహా 3.5 కోట్ల మంది చనిపోయేవారు' అని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నాతో చెప్పారు" అని ట్రంప్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. తన మొదటి 10 నెలల పాలనలోనే భారత్-పాక్ ఘర్షణ సహా 8 యుద్ధాలను అంతం చేశానని గుర్తుచేశారు. ఆ ఘర్షణ సమయంలో 11 ఖరీదైన యుద్ధ విమానాలు కూలిపోయాయని కూడా ప్రస్తావించారు. పాక్ ప్రధాని తన చీఫ్ ఆఫ్ స్టాఫ్ ముందే తనకు బహిరంగంగా కృతజ్ఞతలు తెలిపారని ట్రంప్ ఉదహరించారు.

# నంద్యాలలో ఘనంగా పిఏవి గ్రూప్ కార్యాలయ ప్రారంభోత్సవం





## కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ పబ్బతి వేణుగోపాల్ కు శుభాకాంక్షల వెల్లువ

నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 12 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పిఏవి గ్రూప్ కార్యాలయం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిలుగా హాజరై, రిబ్బన్ కత్తిరించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పిఏవి గ్రూప్ చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ వ్యాపార రంగంలో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సంస్థ అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నంద్యాల ప్రాంత ఆర్థికాభివృద్ధిలో ఇలాంటి సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. పిఏవి గ్రూప్ చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ మాట్లాడుతూ మా నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసి, మమ్మల్ని ఆశీర్వదించిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారికి, ఏవీ సుబ్బారెడ్డి గారికి, ఎన్ఎండి ఫిరోజ్ గారికి మరియు ఇతర ప్రముఖులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . నంద్యాల ప్రాంతంలో వ్యాపార విస్తరణతో పాటు, స్థానిక నిరుద్యోగులకు చేతనైనంత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే మా పిఏవి గ్రూప్ ప్రధాన లక్ష్యం అన్నారు . రాబోయే రోజుల్లో సంస్థను మరింత పటిష్టం చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న మరియు టిడిపి నాయకులు, నంద్యాల పట్టణ ప్రముఖులు పాల్గొని పబ్బతి వేణు గారికి శుభాకాంక్షలు తెలియజేశారు





# ఒక మనిషి చనిపోయాడు.దేహంలోంచి ఆత్మ బయటకు వచ్చింది.చుట్టూ చూశాడు

చేతిలోపెట్టెతోదేవుడుతనదగ్గరకు వచ్చాడు. చనిపోయిన మనిషికీ భగవంతుడుకి మధ్య సంభాషణ ఇలా సాగింది.

**దేవుడు:**

మానవా..నీ శరీరం పడిపోయింది.

ఇక ఈ జన్మ ముగిసింది. నాతో పద.

**మనిషి:**

అయ్యో ఇంత త్వరగానా?

నేను భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కన్నాను స్వామీ!

**దేవుడు:**

తప్పదు నాయనా! నీవు నాతో రావాల్సిన సమయం వచ్చింది.

**మనిషి:**

నాకోసం తెచ్చిన ఆ పెట్టె ఇటివ్వండి.ఏం తెచ్చారో చూస్తాను

**దేవుడు:**

నీకు చెందినవి ఉన్నాయి.

**మనిషి:**

నావా? అంటే నా బట్టలు, డబ్బులు,భూమి పత్రాలు అవా?

**దేవుడు:**

అవెప్పటికీ నీవి కావు.అవన్నీ భూమివే.ఇక్కడే ఉంటాయి

**మనిషి:**

పోనీ నా జ్ఞాపకాలున్నాయా దాన్లో?

**దేవుడు:**

కాదు. జ్ఞాపకాలనేవి కాలానికి చెందినవి. కాలగర్భంలోకి వెళ్లిపోతాయి

**మనిషి:**

అయితే నా ప్రతిభ, ప్రజ్ఞ ఉండి ఉంటాయి!

**దేవుడు:**

అవి పరిస్థితులవి నీవి కావు

**మనిషి:**

నా స్నేహితులున్నారా అందులో?

**దేవుడు:**

వారు కేవలం నీతో కొద్ది దూరం కలిసి వచ్చే తోటి ప్రయాణికులు మాత్రమే

**మనిషి:**

హూం..నా భార్య, బిడ్డలునా?

**దేవుడు:**

వారు నీతో కలిసి ఒక నాటకంలో పాల్గొన్న పాత్రధారులు

**మనిషి:**

అయితే నీవద్ద ఉన్న పెట్టెలో నా శరీరం ఉండుండాలి!

**దేవుడు:**

తప్పు. నీ శరీరం ధూళికి చెందినది.మట్టిలో పడుతుంది.

**మనిషి:**

స్వామీ అయితే నా ఆత్మా?

**దేవుడు:**

ఆత్మ నీదెలా అవుతుంది. అది నాది.

**మనిషి:** ఆ పెట్టె ఇటివ్వు స్వామి అని తీసుకుని తెరిచి చూశాడు.కళ్లలోనీళు ్లసుడులుతిరిగాయిఆపెట్టె ఖాళీగాఉంది.

**మనిషి:** కాలం చెస్తే తనతో తీసుకువచ్చేది ఏదీ ఉండదు అని చెప్పేందుకే దేవుడు ఈ ఖాళీ పెట్టె తెచ్చాడని అర్థం అయింది.

బతికున్నంత కాలం నా వాళ్లు,

అవన్నీ నావే,

ఇవన్నీ నాకే అని ఆశతో,

ఆరాటంతో పరుగుతు పెడుతూ పరమాత్మ స్మరణ మరిచాను అని దుఃఖితుడయ్యాడు.

**మనిషి:** స్వామీ చివరగా అడుగుతున్నాను.

నాది అనేది ఏమైనా ఉందా అసలు?

**దేవుడు:**ఉంది. నీవు జీవించినంతకాలం ప్రతి క్షణం నీదే. ఆ క్షణాల్లో నీవు ఆర్జించే మంచి,

చెడు యొక్క పర్యవసానాలు నీకే చెందుతాయి.

అందుకే ప్రతిక్షణం మంచిని పంచాలి పెంచాలి,

స్వార్థం కోసం ఎదుటివారిని ఇబ్బందుల పాలు చేయకూడదు

భగవన్నామ స్మరణ చేయాలి.

పశ్చాతాపులను క్షమించాలి.

తోటివారి నుంచి మనకి

సంక్రమించే చెడును విసర్జించాలి,

మానవసేవ-మాధవసేవ అని గుర్తించి జీవించాలి.

సేకరణ: పి.వి. సురేంద్ర
(రుద్రవరం ప్రతినిధి)

# కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించిన పోలీసులు





## ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలు అక్రమ మద్యం స్వాధీనం

వెలుగోడు, ఏప్రిల్ 12 (నంది పత్రిక): నంద్యాల జిల్లా ఆత్మకూరు సబ్ డివిజన్ నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు డిఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. ఎస్పీ సునీ షోరన్ ఆదేశాల మేరకు నందికొట్కూరు, వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రత్యేక తనిఖీలు జరిగాయి.వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంతకందాల గ్రామంలో సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. అదేవిధంగా అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.నందికొట్కూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షికారి పేటలో 'ఆపరేషన్ వజ్రపహారి' కార్యక్రమంలో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి, రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర గల వ్యక్తుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, మదకద్రవ్యాల దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత, సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత, శక్తి యాప్ ఉపయోగాలు, టోల్ ఫ్రీ నంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించారు.అసాంఘిక కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని వ్యక్తులకు తెలియజేసారు.

# రేపు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు నంది పత్రిక..... కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

# చలో బండ్లపల్లి తరలి వెళ్లిన సిపిఐ

## బి కే యం యు నాయకులు

### ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలంటూ చేపట్టిన పాదయాత్ర ముగింపు బహిరంగ సభకు బద్వేల్ నుండి తరలి వెళ్ళిన సిపిఐ శ్రేణులు




బద్వేల్ ఏప్రిల్ 12నంది పత్రిక : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి ఆస్థానంలో వి.బి.జి రాంజీ పథకాన్ని ప్రవేశపెట్టడం సరేంది కాదని ఆ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(దీఖవీఖ) ఆధ్వర్యంలో ఈనెల పది నుంచి 12 వరకు అనంతపురం నుండి దేశంలోనే మొట్టమొదటిసారిగా ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి గ్రామానికి జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలోపాదయాత్ర నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు బద్వేల్ ప్రాంతం నుండి సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారని ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా , సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్య, గుల్జార్ సింగ్ గోరియా, నిర్మల్ పాల్గొని ప్రసంగించారు.బహిరంగ సభకు తరలి వెళ్లిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పి.వి రమణ జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షులు పొంగూరునాగరాజు, నాయకులు వెంకటయ్య ఓబులేష్ గురయ్యా లక్ష్మమ్మ ఓబులమ్మ సుప్రజ శివ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత రమణ మూర్తికి కళారాధన, లయన్స్ క్లబ్ సత్కారం.



## వైష్ణవ వెంకటరమణమూర్తి సాహితీ సేవలు విశిష్టమైనవి: ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు. ఉగాది పురస్కారాలు పునరుద్ధరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు: కళారాధన ప్రధాన కార్యదర్శి, డాక్టర్ రవి కృష్ణ.

నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 12 . (నంది పత్రిక ):ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున నంద్యాల కు చెందిన సాహితీవేత్త వైష్ణవ వెంకట రమణమూర్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం స్వీకరించిన సందర్భంగా కళారాధన సాంస్కృతిక సంస్థ కార్యాలయంలో కళారాధన, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఘనంగా సత్కరించారు.నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు, కళారాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుర్రాల రవికృష్ణ పాల్గొని రమణమూర్తిని శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ రమణమూర్తి చేసిన విశిష్ట సాహితీ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించడం హర్షణీయమన్నారు. రమణమూర్తి అనేక కావ్యాలు రచించడమే కాకుండా పద్య సాహిత్య ప్రాచుర్యానికి చేసిన సేవలు విశిష్టమైనవనీ ప్రశంసించారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రమణమూర్తి చిన్నయ్య సూరి సాహితీ సంస్థ ద్వారా తెలుగు సాహిత్య ప్రాభావానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఉగాది, కళా రత్న పురస్కారాలు గత సంవత్సరం నుండి కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడం పట్ల రాష్ట్రంలోని కళాకారులు సాహితీవేత్తలు, హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వివిధ రంగాల సేవలను గుర్తించి ఈ పురస్కారాలు అందించడానికి నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లకు ధన్యవాదాలు తెలిపారు.తెలుగు కవులు నరేంద్ర, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు రమణమూర్తి సాహితీ సేవలను ప్రస్తుతిస్తూ కవితా గానం చేశారు.రమణమూర్తి మాట్లాడుతూ తెలుగు పద్యం ప్రాచుర్యానికి తన జీవితమంతా కృషి చేయడం జరిగిందని, తన రచనల పైన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం పరిశోధన గ్రంథం రూపొందిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోన్ చైర్మన్ నిజాముద్దీన్,సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య,ప్రముఖ తెలుగు కవులు, అధ్యాపకులు అవ్వారి శేష ఫణి,డాక్టర్ కురుమేటి కిషోర్, నరేంద్ర, నీలకంఠమాచారి, కొప్పుల ప్రసాద్, మహమ్మద్ రఫీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# డోన్ ఎంవిఐ క్రాంతికుమార్‌కు కీలక బాధ్యత



డోన్ .ఏప్రిల్ 12 . (నంది పత్రిక ):ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ జాయింట్ సెక్రటరీగా డోన్‌కు చెందిన ఎంవిఐ క్రాంతికుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సహచర అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.ఈ పదవితో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని క్రాంతికుమార్ తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

# నంద్యాల వైఎస్ నగర్‌లో ఆధ్యాత్మిక శోభ





**-వైభవంగా హరిహర పుత్ర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట**

**-మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి**

నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 12 . (నంది పత్రిక ):నంద్యాల పట్టణంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి. వైఎస్ నగర్‌లో నూతనంగా నిర్మించిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయం భక్తుల జయజయధ్వానాలతో మారుమోగింది. శాస్త్రోక్తంగా జరిగిన విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారి కృపకు పాత్రులయ్యారు. నంద్యాల వైఎస్ నగర్ ఆధ్యాత్మిక వేదికగా మారింది. ఇక్కడ నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. తెల్లవారుజాము నుంచే వేద పండితుల మంత్రోచ్చారణలు, హోమాలు, జపాదులతో ఆలయ ప్రాంగణం పునీతమైంది. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ క్రతువును చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ పవిత్ర కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆలయ ధర్మకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ, వైఎస్ నగర్ భక్తులకు ఈ ఆలయం ఒక దివ్య ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని ఆకాంక్షించారు."సమాజంలో భక్తి భావాన్ని పెంపొందించడంలో ఇలాంటి దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నంద్యాల మరియు వైఎస్ నగర్ ఈ ప్రజలకు అయ్యప్ప స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ అభినందించారు." అయ్యప్ప స్వాములు, స్థానిక భక్తుల రాకతో వైఎస్ నగర్ వీధులన్నీ అయ్యప్ప నామస్మరణతో మారుమోగాయి. ప్రతిష్టా మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ వేడుక నంద్యాల పట్టణంలో ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చింది.వేద మంత్రాల సాక్షిగా జరిగిన ఈ విగ్రహ ప్రతిష్టతో వైఎస్ నగర్ అయ్యప్ప నామస్మరణతో పులకించిపోయింది. భక్తులంతా స్వామివారి ఆశీస్సులు పొంది పునీతులయ్యారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డు ఇన్చార్జి నంద్యాల జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టీవీ రమణ, నంద్యాల జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మరియు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 13వ తేదీ ( సోమవారం) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం

**అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక**

**అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**




కర్నూలు నంది పత్రిక.....ఈ నెల 13వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చుఅర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 12 : బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల చీఫ్ ఎగ్జామినర్, ప్రిన్సిపాల్ అబుదూర్ రాఫీ ఆదివారం తెలిపారు. మొత్తం 114 మంది ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో 99 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని 15 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. 6 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లు గా వ్యవహరించారని ప్రిన్సిపాల్ వివరించారు. ఇందుకు సంబంధించి ఈ నెలాఖరులోగా ఫలితాలను వెల్లడిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు

# ఐపీఎల్ బెట్టింగ్, జూదం పై కఠిన చర్యలు ...

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ .**



కర్నూలు నంది పత్రిక.... ఐపీఎల్ బెట్టింగ్ , మట్కా, జూద కార్యకలాపాలపై రాజీపడని కఠిన చర్యలు చేపట్టాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆదివారం జిల్లా ఎస్పీ జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణపై ముఖ్య సూచనలు జారీ చేశారు.ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో జూద కార్యకలాపాలు కట్టడి చేయాలన్నారు.వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ...ఐపీఎల్ మ్యాచ్‌లను ఆధారంగా చేసుకుని ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతున్న బెట్టింగ్ కార్యకలాపాలు యువతను తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు.ఈ తరహా అక్రమ కార్యకలాపాలు కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీసే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయిన వ్యక్తులు దానిలో నుండి బయటపడలేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయన్నారు.ఇలాంటి చర్యలు కేవలం వ్యక్తిగత జీవితశీ పైన నే కాకుండా, మొత్తం కుటుంబం పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, సమాజంలో నేరాల పెరుగుదలకు కూడా కారణమవుతున్నాయని కర్నూలు ఎస్పీ గారు పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు తమ పరిధిలోని అనుమానాస్పద ప్రాంతాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు.అలాగే క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూద కేంద్రాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలన్నారు .ఎవరైనా ఈ కార్యకలాపాలలో పాల్గొంటున్నట్లు గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.అక్రమ వ్యవస్థలను పూర్తిగా నిర్మూలించాలన్నారు.పోలీసు అధికారులు తమ పరిధిలో ఐపీఎల్ బెట్టింగ్, జూదం, మట్కా వంటి అక్రమ కార్యకలాపాల వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలు కూడా ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా అక్రమ బెట్టింగ్ లేదా జూదం లేదా మట్కా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కర్నూల్ కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9121101100కు జిల్లా ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కర్నూల్ ఎస్పీ తెలిపారు.జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడం పోలీసుల ముఖ్య బాధ్యత అని, అందులో భాగంగా ఇటువంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టడం అత్యంత అవసరమని కర్నూలు ఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, జిల్లాలో నేరాలను పూర్తిగా నియంత్రించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఎవరెస్టు బేస్ క్యాంప్ యాత్రకు వెలుగోడు విద్యార్థిని ఎంపిక

**జిల్లా స్థాయి ప్రతిభతో రాష్ట్ర స్థాయికి అడుగులు**




వెలుగోడు, ఏప్రిల్ 12 (నంది పత్రిక):వెలుగోడు మండలం లోని మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థిని బండి స్వాతి ప్రతిభ చాటుకుని ఎవరెస్టు బేస్ క్యాంప్ సాహస యాత్రకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది.స్వాతి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి, గండికోటలో నిర్వహించిన ఎంపికల్లో ఉత్తీర్ణత సాధించడంతో పాటు జమ్మూ కాశ్మీర్‌లోని లడాఖ్ ప్రాంతంలో శిక్షణ పొందింది. అనంతరం ఎవరెస్టు బేస్ క్యాంప్ యాత్రకు ఎంపికైంది. ఈ సాహస యాత్ర ఏప్రిల్ 14 నుండి ఏప్రిల్ 30 వరకు రాష్ట్ర సర్వ శిక్ష అభియాన్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించబడుతుంది. మొత్తం 20 మంది విద్యార్థులు ఈ యాత్రలో పాల్గొనగా, అందులో తమ కళాశాల విద్యార్థిని ఎంపిక కావడం ఎంతో ఆనందకరమని ప్రిన్సిపల్ ఎం. నళిని సంతోషం వ్యక్తపరుస్తూ కళాశాల అధ్యాపక బృందం బండి స్వాతికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.ఏపీఎంఎస్ 6వ తరగతి ప్రవేశ వివరాలు: వెలుగోడులో నిర్వహించిన ఏపీఎంఎస్ 6వ తరగతి పరీక్షకు మొత్తం 192 మంది విద్యార్థులు కేటాయించగా, 186 మంది హాజరైనట్లు, 6 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత రమణ మూర్తికి కళారాధన, లయన్స్ క్లబ్ సత్కారం

**వైష్ణవ వెంకటరమణమూర్తి సాహితీ సేవలు విశిష్టమైనవి: ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు**

**ఉగాది పురస్కారాలు పునరుద్ధరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు: కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ.**



నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 12 ( నంది పత్రిక ) ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున నంద్యాల కు చెందిన సాహితీవేత్త వైష్ణవ వెంకట రమణమూర్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం స్వీకరించిన సందర్భంగా కళారాధన సాంస్కృతిక సంస్థ కార్యాలయంలో కళారాధన, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఘనంగా సత్కరించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు, కళారాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుర్రాల రవికృష్ణ పాల్గొని రమణమూర్తిని శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ రమణమూర్తి చేసిన విశిష్ట సాహితీ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించడం హర్షణీయమన్నారు. రమణమూర్తి అనేక కావ్యాలు రచించడమే కాకుండా పద్య సాహిత్య ప్రాచుర్యానికి చేసిన సేవలు విశిష్టమైనవనీ ప్రశంసించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రమణమూర్తి చిన్నయ్య సూరి సాహితీ సంస్థ ద్వారా తెలుగు సాహిత్య ప్రాభావానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఉగాది, కళా రత్న పురస్కారాలు గత సంవత్సరం నుండి కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడం పట్ల రాష్ట్రంలోని కళాకారులు సాహితీవేత్తలు, హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వివిధ రంగాల సేవలను గుర్తించి ఈ పురస్కారాలు అందించడానికి నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు కవులు నరేంద్ర, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు రమణమూర్తి సాహితీ సేవలను ప్రస్తుతిస్తూ కవితా గానం చేశారు. రమణమూర్తి మాట్లాడుతూ తెలుగు పద్యం ప్రాచుర్యానికి తన జీవితమంతా కృషి చేయడం జరిగిందని, తన రచనల పైన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం పరిశోధన గ్రంథం రూపొందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోన్ చైర్మన్ నిజాముద్దీన్,సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య,ప్రముఖ తెలుగు కవులు, అధ్యాపకులు అవ్వారి శేష ఫణి,డాక్టర్ కురుమేటి కిషోర్, నరేంద్ర, నీలకంఠమాచారి, కొప్పుల ప్రసాద్, మహమ్మద్ రఫీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధమ నందిశ్వర ఆలయంలో సింగనపల్లి లోకేష్, అంజలిల వివాహం

**నూతన వధూవరులను ప్రత్యేకంగా ఆశీర్వదించిన అఖిలభారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం**

**ఉచిత విద్యుత్, కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్**



నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 12 . (నంది పత్రిక ):నంద్యాల ప్రధమ నందీశ్వర స్వామి ఫంక్షన్ హాల్ ప్రధమ నందీశ్వర స్వామి ఆలయ ఫంక్షన్ హాల్ లో సింగనపల్లి వారి లోకేష్, అంజలి దంపతుల వివాహం అత్యంత వైభవంగా జరిగింది.నంద్యాల పట్టణంలోని ప్రధమ నందీశ్వర స్వామి ఆలయ ఫంక్షన్ హాల్ లో ఆదివారం మంగళ వాయిద్యాలు వేద మంత్రాల మధ్య జరిగిన వివాహ వేడుకలకు అధికారులు, రాజకీయ, నాయకులు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.నూతన వధూవరులను ప్రత్యేకంగా ఆశీర్వదించిన అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి,తదితరులు ఆశీర్వదించారు.ఫంక్షన్ హాల్ను విద్యుత్ బల్బుల కాంతులతో పలు రకాలైన డిజన్లతో ఏర్పాటు చేసి,వివాహ వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ఆహ్వానం పలుకుతూ, పలు రకాల వంటకాలతో మంచి ఆతిథ్యం కల్పించారు.నూతన వధూవరులు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో భోగభాగ్యాలతో పిల్లాపాపలతో ఆదర్శ దంపతులుగా జీవించాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థిస్తూ అక్షింతలు వేసి ఆశీర్వదించారు.అనంతరం అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేసి, ఉచిత విద్యుత్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.గత ప్రభుత్వం రజకులకు రుణాలు ఇచ్చి, ఆదుకున్నారని ఇప్పుడు చేతివృత్తులు చేసుకుంటూ కులవృత్తిగా జీవనం సాగిస్తున్నమేము ప్రభుత్వం ఆదుకొని ఉచిత విద్యుత్తు, రుణాలు మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు.

## సిఐటియు 17వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చెయ్యండి




నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 12 . (నంది పత్రిక ):ఏప్రిల్ 17 18 19 తేదీలలో నంద్యాల పట్టణంలో జరుగు సిఐటియు రాష్ట్ర 17వ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు టి రమేష్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు పిలుపునిచ్చారు.సిఐటియు నంద్యాల జిల్లా కమిటీ సమావేశం నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా రైతు సంఘం జిల్లా నాయకులు టి రమేష్ కుమార్ అలాగే సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ కార్మిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం ఆందోళన పోరాటాలు నిర్వహిస్తుందని కార్మిక హక్కులు సంక్షేమంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ పరిశ్రమల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహిస్తుందని సంస్కరణల పేరిట పడుతున్న బారాలపైన ప్రజానీకాన్ని కార్మికులను చైతన్యవంతం చేస్తూ స్కీవర్కర్లు ఇతర అసంఘటిత కార్మికుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వారు చేస్తున్న ఆందోళనకు అండగా నిలుస్తుంది.ప్రకృతి వైపరీత్యాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న సందర్భాల్లో అనేక సేవా కార్యక్రమాలు తోడ్పడు అందిస్తూ ఈనెల 17 18 19వ తేదీలలో నంద్యాలలో సిఐటియు 17వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని అన్నారు.ఈ మహాసభలో జయప్రదం కోసం సిఐటియు కార్యకర్తలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థులను భవిష్యత్తులో క్రియేటివ్ థింకర్స్,డిజైన్ మేకర్స్ గా తయారుచేస్తాం.







## శ్రీ శాంతినికేతన్ పాఠశాలలో మైండ్ గేర్ రోబోటిక్స్ ఎక్స్ పో.

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 12 ( నంది పత్రిక )** విద్యార్థుల భవిషత్తు దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకొని రాబోయేరోజుల్లో క్రియేటివ్ థింకర్స్ గా,డిజైన్ మేకర్స్ గా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ పేర్కొన్నారు. నంద్యాల క్రాంతి నగర్ శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల లో స్టెమ్ బోట్ సొల్యూషన్ , అటల్ టింకరింగ్ ల్యాబ్ సంయుక్త సహకారంతో "మైండ్ గేర్ రోబోటిక్స్ ఎక్స్ పో" కార్యక్రమం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ శాంతినికేతన్ సి.బి.ఎస్.ఈ విద్యాసంస్థల అధినేత సూర్యదేవర సుధాకర్ , జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ కె.వి.సుబ్బారెడ్డి జిల్లా దీక్ష కో-ఆర్డినేటర్ శ్రీ నాగేంద్రుడు , ఎస్.వి.ఆర్.ఇంజనీరింగ్ కాలేజ్ ఈ.సీ.ఈ ప్రొఫెసర్ మొహమ్మద్ మొహసినల్ హక్ హాజరయ్యారు. కార్యక్రమములో శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సూర్యదేవర సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఏఐ, కోడింగ్, రోబోటిక్స్ కు సంబంధించిన వివిధ రకాల నమూనాలను ప్రస్తుతమున్న టెక్నాలజీని అప్డేట్ చేసుకొని రాబోయే రోజుల్లో క్రియేటివ్ థింకర్స్ గా ,డిజైన్ మేకర్స్ గా విద్యార్థులను తయారు చేసే ఉద్దేశంతో, మన చుట్టూ జరుగుతున్న అనేక సమస్యలకు ఒక పరిష్కారం చూపే విధంగా వివిధ రకాలైన ప్రాజెక్ట్ లను విద్యార్థులు ప్రదర్శించడం జరిగిందన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ వచ్చిన తరువాత తమ పాఠశాల శ్రీ శాంతినికేతన్ విద్యా సంస్థ లలో ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించడం జరుగుతుందని ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో సైన్స్ పట్ల సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తిని జిజ్ఞాసని పెంచడమే కాకుండా మంచి కమ్యూనికేటివ్ స్కిల్స్ ని టీం వర్క్ ని క్రియేటివ్ థింకింగ్ ని అభివృద్ధి చేసేందుకు ఎంతగానో సహకరిస్తాయన్నారు. జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ శ్రీ కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థలు నంద్యాల జిల్లా లోని విద్యార్థులకు మొట్టమొదట ఇలాంటి చక్కని అవకాశం కల్పించడం నిజంగా అభినందనీయమని అలాగే విద్యార్థులు కూడా ఇలాంటి అవకాశాలను చక్కగా వినియోగించుకొని,తమ మేధస్సుకు పదును పెట్టుకొని అందనంత ఎత్తుకు ఎదగాలన్నారు.

జిల్లా దీక్ష కోఆర్డినేటర్ నాగేంద్రుడు మాట్లాడుతూ రోబోటిక్ అనేది ఒక మిషన్ మాత్రమే కాదు మన పనిని మనం చాలా సులువుగా స్మార్ట్ గా చేసుకునేందుకు అనువైన పరికరం అన్నారు. అలాగే ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ ప్రొఫెసర్ మహమ్మద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు సాధారణంగా ఉన్నత స్థాయిలో తెలుసుకోగలుగుతారు కానీ విద్యార్థులైన మీకు మీ అదృష్టం కొద్ది మీ పాఠశాల యాజమాన్యం పాఠశాల స్థాయిలోనే మీకు ఏర్పాటు చేయడం నిజంగా విద్యార్థులు చేసుకున్న అదృష్టమని, మీరు ఉన్నత స్థాయి విద్యార్థుల కంటే టెక్నాలజీలో చాలా ముందంజలో ఉన్నారన్నారు ఇలాంటి అవకాశం సుధాకర్ కల్పించడం విద్యార్థుల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి విద్యార్థులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై దిగ్విజయంగా పూర్తి చేశారు.





# చట్టసభలో మహిళ అడుగు మానవాభివృద్ధికి ముందడుగు

**నంది పత్రిక**:జనాభాలో సగం ఆకాశంలో సగం అని మహిళల పట్ల నినాదాలు హోరు జోరు పెరిగిందే గాని పురుషులతో పాటు సమాన అభివృద్ధిలో మహిళా లోకం వెనుకబడి ఉంది.మహిళా సంక్షేమం పట్ల రాజకీయ పార్టీల మాటలుకోటలుదాటుతున్నాయి.రాజకీయాధికారానికి మహిళలను అంటరాని వారిగా చూసే పార్టీల దంద్వ వైఖరి మహిళలకు శాపంగా పరిణమించింది.రాజకీయ అధికారంలో స్త్రీలకు సమాన వాటా ఇవ్వడంకోసం మహిళా రిజర్వేషన్స్ చట్టంతో పరిపాలనకు న్యాయబద్ధత చేకూరుతుంది విధాన రచనలో ప్రజాహిత కార్యక్రమాల అమలులో నాణ్యత పెరుగుతుంది.78 సం" రాల స్వతంత్ర భారత్లో కొన్ని రాజకీయ కుటుంబాలకు సంపన్న వర్గాలకే నాయకత్వ అవకాశాలు పరిమితమైనవి.అలాకాకుండా విభిన్న నేపద్యానికి చెందిన సమర్ధులకు బాధ్యతాయుతమైన స్థానంలోకి ఎదిగివచ్చేందుకు వీలు కల్పించాలి.అందుకు రిజర్వేషన్స్ ద్వారా మహిళా సాధికార సాధనకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించే పార్టీలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్స్ బిల్లును ప్రజాస్వామిక స్ఫూర్తితో వ్యవహరించి మహిళా సాధికారత పట్ల చిత్తశుద్ధిని ప్రకటించాలి.ఇల్లు చక్కదిద్దే చేతులునేడు దేశాన్ని తీర్చి దిద్దాలి కుటుంబ భారం మోసే చేతులునేడు చట్టాలు చేయాలి.మహిళలు చట్టసభల గడప దాటాలి అవకాశాల బాటలో నడవాలి మహిళా రిజర్వేషన్స్ అనేది కేవలం సీటు కాదు ఆత్మగౌరవానికి దక్కిన అధికార పీఠం మహిళలు చట్టసభలకు చేరితే వివక్ష సంకెళ్లు తెగిపోతాయి.న్యాయం గొంతుక నినదిస్తుంది.అభివృద్ధి ఊపిరి పోసుకుంటుంది.ఆడపిల్లల చదువుకు ఆటంకం ఉండదు.మహిళలకు సత్వర న్యాయం సిద్ధిస్తుంది మహిళ రక్షణకు భయం ఉండదు.సుస్థిర నిర్ణయాలు జరుగుతాయి. అవినీతి రహిత సమాజంఏర్పడుతుంది. ప్రజాస్వామ్యాన్ని పరిహాసంపాలు చేస్తున్న పురుషాధిక్య సంస్కృతరూపుమాసి ప్రజా పనులు త్వరిత గతిన పూర్తి అవుతాయి.ఓర్పుసానుభూతితో నిర్ణయాలు తీసుకునే మహిళల సహజ శక్తి సామర్థ్యాలు సమాజ అభివృద్ధికి చోదక శక్తి లవుతాయనిపలు అధ్యయనాలు చాటుతున్నాయి.మహిళా రిజర్వేషన్స్ వల్లప్రగతి పురోగతి సమాజ హితం జరిగి భావితరాలకు భాగ్యోదయం సిద్ధిస్తుంది.చట్టసభల్లో మహిళలరిజర్వేషన్స్ మహిళా రక్షణ విద్యా వైద్య సంక్షేమ మెరుగైనచట్టాలు చేస్తారు .మహిళా ప్రాతినిధ్యం పెరగడం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది .లింగ వివక్ష తగ్గి మహిళలు స్వంత నిర్ణయాలుతీసుకునే శక్తి పొందుతారు.చట్టసభల్లో రిజర్వేషన్స్ తో మహిళా కోటలో సీటుతో పాటు సీటు వెనుక ఉన్నఅధికారం రావాలి .భర్త / తండ్రి చెప్పినట్లు ఆడే బొమ్మల కాకుండ తన గొంతు తనే వినిపించే బాధ్యత పెరగాలి.వారసత్వ రాజకీయాల వెలుగులో కాకుండా సామాన్య మహిళలకు సభలో చోటు దక్కాలి.రాజకీయ చైతన్యం ప్రతి గడపకు చేరాలి ముసుగులోఉన్న నాయకత్వం బయటకు రావాలి.మహిళా రిజర్వేషన్లంటే కేవలం అవకాశం కాదు.అది ఒక సామాజిక విప్లవం

కావాలి.సమస్యల సుడిగుండంలో ఉన్నమహిళలకు చట్టసభలేధైర్యాన్నిచ్చే వేదికలు కావాలి.నిదులకేటాయింపులో వాటా ఉండాలి నిర్ణయాలు

తీసుకోవడంలో మహిళలకు
అధికారం ఉండాలి.జనాభాలో
సగభాగం సగం అవకాశం అన్న
మాటకు అర్థం ఉన్న మహిళలు
పాలనలో కూడా సగభాగమై
వర్ధిల్లాలి.అక్షరాలే ఆయుధాలుగా
ఆత్మవిశ్వాసమే కవచం కావాలి
అప్పుడే మహిళాసంక్షేమం
సంపూర్ణం భారత ప్రజాస్వామ్యం
పరిపూర్ణం.మహిళా ప్రతినిధులు
కుటుంబ సభ్యుల భర్త /తండ్రి
నీడలో కాకుండా స్వయంగా నిర్ణయాలు
తీసుకోవాలి.రాజకీయ నేపథ్యమున్న మహిళలకు కాకుండా సామాన్య మహిళలకు అవకాశం అందాలి పదవితో పాటు బడ్జెట్ పై పాలనపై అవగాహన నియంత్రణ ఉండాలి.అట్టడుగున ఉన్న అబలలకు అధికారం దక్కాలి

రిజర్వేషన్స్ ఫలితాలు కొందరికి

పరిమితమైతే సామాజిక న్యాయం అన్న మాటకు అర్థం?కులానికి ఓ కోటా గొడుగు కింద నీడలాబీసీ ఉప కులాల కోట ఉండాలి.అదే వారికి రక్షణ కవచం రక్షణ కవచం లాగా ఉన్న వారసత్వ రాజకీయాల గోడలు బద్దలు కావాలి. శ్రమజీవుల ఆడబిడ్డలు చట్టసభల్లో అడుగుపెట్టాలి .జనాభా లెక్కల ప్రాతిపదికన వాటా తేలాలి రావాలి మార్పు కులగణన సాగాలి ఎవరి వాటాఎంతో లెక్కలు తేల్చాలి.పాలనలో బహుజన మహిళా ప్రాతినిధ్యం పెరగాలి.కోటా లో ఉపకోటా చేర్చినపుడే మహిళా రిజర్వేషన్స్



పరిపూర్ణంఅప్పుడే ప్రజాస్వామ్యం సంపూర్ణం.మహిళలకు చట్టసభ టికెట్ల కేటాయింపులో పంపిణీలో సామాజిక న్యాయ జరగాలి.ప్రజాస్వామ్యం వెలగాలి.ఒకరికి చేతిలో అధికారం ఇంకొకరి చేతిలో ఆశలు వద్దు అందరికి సమాన గౌరవం సగభాగం వాటా ముద్దు అపుడే మహిళా రిజర్వేషన్స్ ఒక చారిత్రిక విజయం అపుడే వికసిత్ భారత్ లక్ష్య సాకారం కావాలంటే జనాభాలో సగభాగం ఉన్న మహిళలు పాలన నిర్ణయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలి.మహిళా రిజర్వేషన్స్ చట్టంవస్తే సరిపోదు చైతన్యం రావాలి.సామాజిక వర్గాల్లో మార్పు రావాలి.రిజర్వేషన్స్ ఫలాలు కేవలం పైన ఉన్నవారికే కాదు బహుజన గుమ్మం వరకు చేరాలి.బీసీ ఉప కోటా కోట్లాదిమందిమహిళా రాజకీయ ఉనికికి నిదర్శనంరిజర్వేషన్స్ తరతరాల అణిచివేతకు ముగింపు పలకాలి.అణగారిన వర్గాల ఆత్మగౌరవ జెండా ఎగరాలి.మహిళలు అలంకార ప్రాయం కాదు చట్టాలు శాసించే చైతన్య కిరణాలు కావాలి.బీసీ ఉప కోటా ఆది సంఖ్య కాదు

సకల జనుల సార్వభౌమత్వానికి
దారి దీపం కావాలి.జనాభాకు తగ్గట్లు పాలనలో
మహిళలను భాగస్వాములను
చేసి దేశాన్ని పీడిస్తున్న పలు
వ్యవస్థాగత సామాజిక సమస్యల
పరిష్కారానికి ఉద్యమిద్దాం.(చట్ట సభల్లో స్థానాల సంఖ్యను
పెంచి33 శాతం సీట్లు మహిళలకు రిజర్వేషన్స్ చేస్తూ 2029 నుండి దాన్ని అమల్లోకి తెచ్చేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెడుతున్న సందర్భంగా రాసిన

కవిత)నేదునూరి కనకయ్య

అధ్యక్షులు 1)తెలంగాణ ఎకనామిక్ ఫోరం 2)మాజీ ఎన్ ఎస్ ఎస్ అధికారి 3)తెలంగాణ ఎద్యుకేషన్ ఫోరం 4)తెలంగాణ వికాస వేదిక.5) రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డ్ గ్రహీత 6) ఉత్తమ ఆర్థికవేత్త అవార్డ్ గ్రహీత కరీంనగర్

## నా ప్రమేయం నిరూపిస్తే దేనికైనా సిద్ధం... ఆరోపణలపై మంగ్లీ తీవ్ర భావోద్వేగం

ప్రముఖ జానపద గాయని మంగ్లీ, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారంటూ న్యాయవాది సింగపోగు సుబ్బారావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేవలం బిగ్ బాస్ షోలో అవకాశం కోసమే సుబ్బారావు తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రచారం పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. ఈ వ్యవహారంపై మీడియాతో మాట్లాడుతూ ఆమె తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇందులో తన ప్రమేయం నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. నోట్లకట్టలతో కనిపించింది తన తమ్ముడు కాదని స్పష్టం చేశారు. సుబ్బారావు ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంగ్లీ, "నాపై చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవాలు. గతంలో నా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వీడియోలను తొలగించాలంటే రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. నేను డబ్బు ఇవ్వకపోవడంతోనే నాపై కక్షగట్టి ఇలాంటి నీచమైన ప్రచారానికి దిగారు" అని మంగ్లీ ఆరోపించారు.

**వివాదం నేపథ్యం ఇదే**

కొద్ది రోజుల క్రితం న్యాయవాది సుబ్బారావు, సింగర్ మంగ్లీ మైక్రో ఫైనాన్స్ పేరుతో అమాయక ప్రజల నుంచి సుమారు రూ.10 కోట్లు వసూలు చేసి మోసం చేశారని ఆరోపిస్తూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా, ఈ విషయంపై మంగ్లీ, ఆమె సోదరులు తనను ఫోన్‌లో బెదిరించారని కూడా ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**మంగ్లీ ఆవేదన**

మీడియా సమావేశంలో మాట్లాడిన మంగ్లీ, తనపై వస్తున్న ఆరోపణల కారణంగా తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. "ఎక్కడ చూసినా మంగ్లీ, మంగ్లీ అంటూ ఈ నెగెటివిటీని ఎందుకు ఇంత సెన్సేషనల్ చేస్తున్నారు? నా మంచి పనులను ఎవరూ గుర్తించరు.

## కేఎంసిలో జనరల్ మెడిసిన్ జోనల్ సీఎంఇ".. "మెడిసిన్ విభాగంలో లేటెస్ట్ అప్డేట్స్ సమావేశం



**కర్నూలు నంది పత్రిక....** కర్నూల్ మెడికల్ కాలేజీ యందు జనరల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నాడు జోనల్ స్థాయి సీఎంఇ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఎడియంఇ డా సుధాకర్ హాజరయ్యారు. ఈసీఈమెకి కర్నూల్ నంద్యాల అనంతపూర్ జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల జనరల్ మెడిసిన్ పీజీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సదస్సులో సాధారణ రోగాలు, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్, మెటబాలిక్ డిస్ ఫంక్షన్, క్యాన్సర్ చికిత్స మొదలగు వివిధ అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీ అబ్జర్వర్, బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్, జోనస్ సీఏ ఎమ్ఇ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీరాములు, హాస్పిటల్ డిప్యూటీ సూపర్నెంట్ డాక్టర్ శ్రీ లక్ష్మి, విశ్వ భారతి హాస్పిటల్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి & ప్రొఫెసర్ డాక్టర్ రవి కళాధర్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈసీఎంఈ నందు వివిధ విభాగాల నిపుణులు డా శివ ప్రసాద్, డా. మోహన్ రెడ్డి, డా. సాయి సంపత్ కుమార్, డా. శ్రీనివాసులు, డా.మహేశ్వర్ రెడ్డి,డా. విద్యాసాగర్ తదితరులు హాజరయ్యి వివిధ ముఖ్య ఆరోగ్య సమస్యల చికిత్సల అప్డేట్స్ పై విద్యార్థులకు వివరించడం జరిగింది.

## ప్రజల దాహార్తి తీరుస్తున్న చలివేంద్రం :- ఎంపీపీ




**శిరివెళ్ల :(నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రంలోని వసీం ట్రేడర్స్ షాపు దగ్గర ఏర్పాటు చేసిన శుద్ధ జల చలువ నీటి చలివేంద్రం ప్రజల దాహార్తి తీరుస్తున్నదని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం తెలియజేశారు. శిరివెళ్ల ప్రధాన రహదారి నూరాని మసీదు సమీపంలో గల వసీం ట్రేడర్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎంపీపీ పరిశీలించారు. గత 15 రోజుల నుండి తాపీ మేస్త్రి, గౌండ కార్మికులు, హామాలి వర్కర్లు, కార్మిక కర్షక బాటా చారులు పలువురీ ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవిలో దాహం సమస్యలు తలెత్తకూడదన్న సదుద్దేశంతో ఏర్పాటు చేసిన చలివేంద్రం ఉదయం 7 నుండి సాయంత్రం 7-30 వరకు దాహర్తి తీరుస్తున్నట్లు పేర్కొన్నారు. చలివేంద్రంలో ప్రతిరోజు క్రమం తప్పకుండా నీరు ఉండేలా అక్కడ సిబ్బందిని సైతం ఏర్పాటు చేసినట్లు వేసవికాలం ముగిసే వరకు చలివేంద్రం కొనసాగుతుందని ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు.

## జిల్లా మహాసభను విజయవంతం చేయండి



**కొత్తపల్లి - నంది పత్రిక:** ఏప్రిల్ 14వ తేదీన నందికొట్కూరు జై కిసాన్ పార్క్ జరుగు జిల్లా ఏఐటీయూసీ ప్రథమ మహాసభ ను విజయవంతం చేయాలని సీపీఐ ఏఐటీసీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కార్మికులు, కర్షకులు, నాయకులు అందరూ కలిసి హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కేతం. వెంకట్ శివుడు యాదవ్, ఏఐటీసీ నాయకులు భీమలింగము, రైతు సంఘం కార్యదర్శి మోక్షడు, లింగమయ్య, అంజి, గోవిందు, వెంకటేశ్వర్లు, వెంకట్ లింగము, అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు



**కొత్తపల్లి - నంది పత్రిక:** మండలంలోని నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకొని సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. కృష్ణాజలాల నుంచి. ఆలయం బయటపడడంతో భక్తులు. ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని సందర్శించేందుకు వస్తున్నారు. దీంతోపాటు ప్రాచీన గర్భాలయంలోని వేపధారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేసుకుంటున్నారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ వేపదారు శివలింగాన్ని పూలమాలలతో అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, మహా మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు.

## ఆలయాలను దర్శించుకున్న క్యాప్ కో చైర్మన్



**కొత్తపల్లి - నంది పత్రిక:** మండలంలోని కొలనుభారతి దేవి, సంగమేశ్వరం క్షేత్రాలను ఆదివారం రాష్ట్రవినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ మాగులూరి నాగేశ్వర రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు: మందుగా కొలనుభారతిదేవి ఆలయాన్ని చేరుకొని సరస్వతి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో మనుమడికి అక్షరాభ్యాసం నిర్వహించారు. అదేవిధంగా సప్తనది సంగమేశ్వరంను సందర్శించి ప్రాచీన సంగమేశ్వరాలయంలో వేపధారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు.



# ప్రజలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే ప్రతినిత్యం యోగా, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవడం అత్యవసరం:





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 12నంది పత్రిక** భీమవరం పట్టణంలోని 34వ వార్డు పరిధిలో ఆదివారం ఉదయం 6:30 గంటల నుంచి 9:00 గంటల వరకు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో "హ్యాపీ సండే" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒడిశా ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ సురేష్ మహాపాత్ర, వారి సతీమణి కూడా ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం యోగా సాధన చేయడం ద్వారా శరీరానికి నియంత్రణ ఏర్పడి, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించుకోవచ్చని తెలిపారు. యువత తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం అవసరమని సూచించారు. అలాగే వృద్ధులు, మధ్య వయస్కులు యోగా సాధన ద్వారా కొన్ని దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించుకోవచ్చని పేర్కొన్నారు. "హ్యాపీ సండే" కార్యక్రమంలో భాగంగా యోగా, సైక్లింగ్ వంటి ఆరోగ్యకర కార్యకలాపాలతో పాటు పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం, వీధులను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలను కోరారు. పట్టణ జీవనశైలిలో ఒత్తిడిని తగ్గించడానికి సంగీతం, నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. వృద్ధుల కోసం తేలికపాటి వ్యాయామాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనశైలిపై అవగాహన పొందారు. ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు మున్సిపల్ కమిషనర్ ఏ.రాంబాబు, మున్సిపల్ ఇన్‌చార్జ్ ఇంజనీర్ తాతబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, విష్ణు కళాశాల విద్యార్థులు, భారతి విద్యాభవన్ అనాథాశ్రమ విద్యార్థులు మరియు పట్టణ ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి బ్యూరో చీఫ్ ఏప్రిల్ 12నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏప్రిల్ 13వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య తెలియజేశారు.

# ఏప్రిల్ 13న జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహణ

## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి


## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 12నంది పత్రిక** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్,) కార్యక్రమాన్ని ఈ సోమవారం కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.జిల్లా కలెక్టరేట్ తో పాటు డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ ను సంప్రదించవచ్చును. జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అల్పాహారం, భోజనం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# వాడపల్లి, మందపల్లిలలో రూ.16.2కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన దేవాదాయశాఖ మంత్రి ఆనం, ఎమ్మెల్యే బండారు...





## వాడపల్లిలో రూ.12 కోట్లతో శ్రీనివాసం 54 రూమ్స్ ,2 డార్మెటరీలకు శంకుస్థాపన... మందపల్లిలో రూ.4.2 కోట్లతో తైలాభిషేకం మండపం, అన్నదాన భవన కేంద్రంలకు శంకుస్థాపన...

**కొత్త పేట బ్యూరో చీఫ్ ఏప్రిల్ 12నంది పత్రిక** కూటమి ప్రభుత్వ హయంలో కోనసీమ తిరుమల వాడపల్లి అభివృద్ధి శరవేగంగా సాగుతుందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. ఆదివారం వాడపల్లి, మందపల్లి క్షేత్రాల్లో రూ. 16.2కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, అనపర్తి తెదేపా నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్,కె వి సత్యనారాయణ రెడ్డి, పాలూరి సత్యానందం,చిలువూరి సతీష్ రాజు, కుసంపూడి రామకృష్ణరాజు మొదలైనవారు పాల్గొన్నారు. ముందుగా మంత్రి ఆనం, ఎమ్మెల్యే బండారు, నాయకులు వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు, ఆలయ పాలకమండలి మరియు అధికారులు ఆలయ మర్యాదలతో వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆనం, ఎమ్మెల్యే బండారు, నాయకులు వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేసి,తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వాడపల్లిలో రూ. 12కోట్లతో చేపట్టిన శ్రీనివాసం 54 రూమ్స్,2 డార్మెటరీల నిర్మాణానికి మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. తదుపరి మందపల్లి చేరుకుని మందేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందపల్లిలో రూ. 3 కోట్లతో చేపట్టిన తైలాభిషేక మండపం, రూ. 1.2కోట్లతో చేపట్టిన నిత్యాన్నదాన భవనాలకు శంకుస్థాపన చేశారు. వచ్చే 2027 గోదావరి పుష్కరాలకు ఆయా పనులను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# మొక్కజొన్న కు 'మద్దతు' ఏది ?

## దళారుల చేతిలో మోసపోతున్న రైతులు

## పెట్టుబడి కూడా రాని పరిస్థితి




**జూపాడుబంగ్లా ఏప్రిల్ 12 (నంది పత్రిక )** మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కులు వెంకటేశ్వర్లు కోరారు. వినోద్ మిశ్రా కార్యాలయంలో ఆదివారం సిపిఐ (ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో కార్యదర్శి పిక్కులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర నాయుడు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తుందా అని రైతులు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. గతంలో మార్కెడ్ ద్వారా ప్రభుత్వం మే నేరుగా కొనుగోలు చేయడముతో రైతులకు గిట్టుబాటు ధర లభించింది. రైతులు భారీ పెట్టబడి పెట్టి మొక్కజొన్న సాగు చేసినట్లు తెలిపారు. విత్తనాలు మొదలు వ్యవసాయము ఎరువులు పురుగుమందులు రేట్లు విపరీతంగా పెరగడంతో ఎకరాకు సుమారు రూ 40 వేల వరకు పెట్టుబడి పెట్టవలసి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకపోతే ప్రవేట్ వ్యాపారులు దళారులు తక్కువ ధరకు రైతుల దగ్గర మొక్కజొన్న కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు.

**పెట్టుబడి కూడా రాని పరిస్థితి...** ఎకర మొక్కజొన్న సాగుకు సుమారు 40వేల వరకు ఖర్చవుతుంది. 110 రోజులు కష్టానికి ఎకరాకు 15, 20 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అయితే మార్కెట్లో ప్రస్తుతం దళారులు కేవలం రూ 1800 కే అడుగుతునడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది రూ2200 పలికిన ధర ఈసారి ఇంతలా పడిపోవడం పై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. తక్షణమే స్పందించి మార్కెట్ యార్డుల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే రాబోయే రోజుల్లో వామపక్షాలు మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



# జగన్ మోహన్ రెడ్డి తన భాషను, పద్ధతిని మార్చుకోవాలి..

## మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 12 ( నంది పత్రిక )** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మండిపడ్డారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కన్నతల్లిని దూరం పెట్టి, చెల్లితో ఆస్తుల కోసం గొడవ పడుతున్న జగన్, పద్ధతి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. స్వయంగా ఆయన చెల్లి (షర్మిల) 'మా అన్న పిచ్చోడు' అని స్టేట్‌మెంట్ ఇస్తుంటే, ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఇతరులపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. సీనియర్ ఎడిటర్ ఏబీఎన్ రాధాకృష్ణ గారిపై జగన్ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న ఒక పత్రికా ఎడిటర్‌ను "నిన్ను లేకుండా చేస్తా" అని బెదిరించడం జగన్ దురహంకారానికి పరాకాష్ట అని అన్నారు . "జర్నలిస్టులు సమాజానికి వారధులు, ప్రజలకు సమాచారం చేరవేసే వారు అని . అటువంటి వారిని అణచివేయాలని చూడటం దుర్మార్గం" అని తెలిపారు . మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడినప్పుడే ప్రజలు ఆయనను చి కొట్టారన్నారు . ఇప్పుడు మళ్ళీ "సప్త సముద్రాలు దాటినా వదలను, మనుషుల్ని లేకుండా చేస్తా" అనడం చూస్తుంటే పాతాళభైరవి, బాలనాగమ్మ వంటి సినిమాల్లోని విలన్ డైలాగులు గుర్తొస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో ఉన్నవారు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, సంస్కారవంతమైన భాషను వాడాలని హితవు పలికారు. పోలీసులు, వ్యవస్థలు తన జేబులో ఉన్నట్లుగా మాట్లాడటం మానుకోవాలని, అధికారం శాశ్వతం కాదని జగన్ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. జగన్ మోహన్ రెడ్డి తక్షణమే తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, మీడియా స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.

# మా అమ్మాయి మైనరే... సినిమా ఆశ చూపి తీసుకెళ్లారు: మోనాలిసా తల్లి

కుంభమేళా బ్యూటీ మోనాలిసా భోస్లే పెళ్లి వ్యవహారం అనూహ్య మలుపు తిరగడం తెలిసిందే. ఆమె మైనర్ అని ఇటీవలే వెల్లడి కావడం, ఆమెను పెళ్లాడిన ఫర్మాన్ ఖాన్ పై పోక్సో కేసు నమోదు కావడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాజాగా మోనాలిసా తల్లి లతా భోస్లే స్పందించారు. తన కుమార్తె మైనర్ అని, సినిమా అవకాశాలు ఇప్పిస్తానని ఆశ చూపి ఫర్మాన్ ఖాన్ అనే వ్యక్తి ఆమెను తీసుకెళ్లాడని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ, తన కూతురిని తనకు అప్పగించాలని అధికారులను వేడుకున్నారు.

"నా కూతురు మైనర్. పెద్ద సినిమాలో అవకాశం ఇప్పిస్తానని అతను మాయమాటలు చెప్పాడు. బర్త్ సర్టిఫికెట్ మార్పిస్తే అంతా సర్దుకుంటుందని నమ్మించాడు" అని లతా భోస్లే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో తన కుమార్తె జననానికి సంబంధించిన పత్రాలను ఎంతో కష్టపడి సంపాదించానని, వాటి ప్రకారం ఆమె మైనర్ అని స్పష్టమైందని తెలిపారు.

# యాగంటి ఆలయంలో అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ





**బనగానపల్లె ఏప్రిల్ 12నందిపత్రిక** బనగానపల్లె మండలంలో ప్రముఖ శైవ పుణ్య క్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయం పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 5.08 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం మంత్రి బీసి జనార్దన్ రెడ్డి భూమిపూజ చేశారు. ఇందులో ఆలయానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం.. రూ. 3.30 కోట్ల వ్యయంతో 16 అదనపు గదులు, రెండు డార్మిటరీలు, 8 దుకాణాల నిర్మాణం. రూ. 1.25 కోట్లతో నిత్య అన్నదాన సత్రం, రూ. 29 లక్షలతో లడ్డూ కౌంటర్, 24 లక్షలతో దేవస్థానం ప్రాంగణంలో షెడ్డు నిర్మాణాలకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ యాగంటిలో రూ.5.08 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం.గత ప్రభుత్వంలో యాగంటి అభివృద్ధికి ఏం చేశారో పెద్దలు ఒక్కసారి ఆలోచించాలన్నారు.కూటమి ప్రభుత్వ తరపున ఉన్న కొత్త కమిటీ నిధులను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేస్తుంది.గత ఏడాది కాలంలో 2025 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు స్వామి వారికి రూ.5.57 కోట్ల ఆదాయం వచ్చింది. గత ప్రభుత్వంలో 2021 నుంచి 24 వరకు 7 కోట్ల ఆదాయం వచ్చింది.. కానీ ఆ ఏడు కోట్ల సొమ్ముకు సరి అయిన లెక్కపత్రం లేదన్నారు.నేడు స్వామి వారి ఆదాయంతో మేం చేస్తున్న అభివృద్ధి కళ్ళ ముందు కనపడుతుంది.స్వామి వారి ఆదాయం గత ప్రభుత్వంలో ఎక్కడికి పోయినట్లు ? స్వామి వారి ఆదాయ వనరులు ఏం చేసినట్లు ? భగవంతుడికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాటి పాలకమండలపై ఉంటుంది.ఇప్పటికే సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడి వైసీపీ నేతలు పార్కింగ్ స్థల ఏర్పాటుపై కూడా పిటిషన్ వేయడం దుర్మార్గం,అటవీ భూమి కొల్లగొడుతున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారు

మేము ప్రజల కోసం చేస్తుంటే విమర్శలు చేయడానికి ఆలోచన ఉండాలి. అధికారులను బెదిరించడం ఎంత మాత్రం సమంజసం కాదు.. విధి నిర్వహణలో భాగంగా తమ పని తాను చేసుకుపోయే అధికారులపై బెదిరింపులకు పాల్పడటం సరైనది కాదు అన్నారు

**వైసీపీ నాయకులకు చురకలు** మంత్రి బీసి జనార్దన్ రెడ్డి కూటమి ప్రభుత్వ అభివృద్ధి ని అడ్డుకుంటున్న వైసీపీ నాయకులకు చురకాలంటించారు. మేము కూటమి ప్రభుత్వంలో ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోవాలో మాకు తెలుసు.మీరు నిజంగా ప్రజలకు సేవ చేయాలంటే సొంత నిధులతో సేవ చేయాలి..దోచుకోవడం దాచుకోవడం ఇదే వైసిపి నేతల పని అన్నారు.యాగంటిలో జరుగుతున్న అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారు.. అభివృద్ధి జరిగితే మీకు నొప్పి ఏంటి ? సొంత నిధులతో అభివృద్ధి చేసి మాతో పోటీ పడండి కక్ష సాధింపులు ఎంత మాత్రం వైఖరి కాదు అన్నారు.

గతంలో ఎప్పుడు కూడా ఆలయ అభివృద్ధికి సలహాలు, సూచనలకు మాత్రమే పరిమితమయ్యాం. దేవాలయంలో రాజకీయాలకు మేము వ్యతిరేకం.. వ్యక్తిగతంగా ఎప్పుడూ ఆలయంలో ఆధిపత్యం కోసం ప్రయత్నించలేదు.. త్వరలో ఈ అభివృద్ధి కార్యక్రమాలు అన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం ఇస్తాం అన్నారు. కార్యక్రమం లో ఆలయ చైర్మన్ మౌళిశ్వర్ రెడ్డి, ఈవో పాండురంగారెడ్డి దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కోటకొండ గ్రామ సమీపంలో
# అక్రమ మట్టి తవ్వకాలు





**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 12 (నంది పత్రిక):** మండలంలోని కోటకొండ గ్రామ సమీపంలోని కుంటలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వివరాల మేరకు కొందరు వ్యక్తులు రాత్రి సమయాలలో కుంట దగ్గరకు వెళ్లి జెసిబి సహాయంతో మట్టినిత్రవి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించుకుని పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంటలో మట్టిని త్రవి అమ్ముకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. రాత్రి సమయాలలో మట్టిని తవ్వడం వల్ల గ్రామంలో ట్రాక్టర్ల చప్పుడుకు నిద్ర భంగము కలుగుతుందని అలాగే విలువైన మట్టి అక్రమంగా తరలిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవిన్యూ అధికారులు స్పందించి వెంటనే అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**మట్టి తవ్వకాలకు అనుమతులు లేవు... వీఆర్వో గురుస్వామి.** కోటకొండ గ్రామ సమీపంలోని కుంట లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. వెంటనే మట్టి త్రవ్వకాలను జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అనుమతి తీసుకోకుండా మట్టిని త్రవీనట్లయితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# నియోజకవర్గవ్యాప్తంగా సందడి చేసిన ఎమ్మెల్యే కోట్ల





## వరుస వివాహ వేడుకల్లో పాల్గొన్న జయసూర్య ప్రకాశ రెడ్డి

**నంది పత్రిక – డోన్** డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాశ రెడ్డి ఆదివారం నియోజకవర్గవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడంతో పాటు, ప్రజలతో మమేకమయ్యారు.డోన్ మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జరిగిన వట్టివేళ్ల వారి వివాహ వేడుకకు ఆయన హాజరయ్యారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో జరిగిన మల్లెపల్లె వారి పెళ్లి వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని పురాతన కొత్త బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఒక వివాహ వేడుకలో ఆయన సందడి చేశారు. ఆ తర్వాత పట్టణంలోని న్యూ మధు ఫంక్షన్ హాల్‌లో బాయిపల్లె గ్రామ సర్పంచ్ లింగన్న మనవరాలి వివాహ మహోత్సవానికి హాజరై, నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉడుములపాడు గ్రామ సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన కరణం వారి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. బీ. ఎరబాడు గ్రామంలో నిర్వహించిన కలుగొట్ల చింతామను వివాహ వేడుకలో పాల్గొని, కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

**హర్షం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు** తమ ఇంటి శుభకార్యానికి స్వయంగా ఎమ్మెల్యే తరలిరావడం పట్ల ఆయా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ఆయా గ్రామాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తులకు గమనిక... జులై నెల టికెట్ల షెడ్యూల్ విడుదల

తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలకమైన అప్‌డేట్ ఇచ్చింది. 2026 జులై నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటా విడుదల తేదీలను అధికారికంగా ప్రకటించింది. భక్తులు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకునేందుకు వీలుగా, ఏప్రిల్ 18 నుంచి దశలవారీగా ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.విడుదలయ్యే టికెట్లు, తేదీల వారీగా వివరాలు: ఏప్రిల్ 18: ఉదయం 10 గంటలకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భక్తులు ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఏప్రిల్ 21: ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను భక్తులు నేరుగా బుక్ చేసుకోవచ్చు.

# శ్రీ కొత్తూరు సుబ్బరాయునిలో ఆదివారం విశేష పూజలు..!

**-ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.**





**పాణ్యం. ఎస్.కొత్తూరు. నంది పత్రిక. ఏప్రిల్ 12.** పాణ్యం మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గందం అభిషేక పూజలు, రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం మధ్యాహ్నకాల మహా నివేదన సమయంలో స్వామివారికి సర్ప సూక్తంతో సుగంధ ద్రవ్యాలతో, పంచామృత అభిషేకం, మహా రుద్రాభిషేకం, మహా నైవేద్యం, మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తాదులందరూ విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తాదులందరికి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రతి ఆదివారం మరియు మంగళవారాల లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తుంటారు.

# ప్రజల వినతులకు త్వరగా పరిస్కారం చూపాలి.. మంత్రి

## ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**బనగానపల్లె ఏప్రిల్ 12నందిపత్రిక** సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజా వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని అర్జీ లు ఇచ్చినవారికి హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

# డోన్‌లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభం

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం: ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి



**నంది పత్రిక –డోన్**డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం ఆదివారం సందడిగా మారింది. క్రీడా భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్-14 జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ క్రీడా పోటీలకు డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.క్రీడాకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తక పఠనానికే పరిమితం కాకుండా, క్రీడల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కబడ్డీ వంటి దేశీయ క్రీడలు మన భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయని, ఇలాంటి గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.క్రీడల వల్ల శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా, మానసిక ధైర్యం, ఓర్పు, క్రమశిక్షణ మరియు జట్టు తత్వం పెరుగుతాయని తెలిపారు.జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీల్లో డోన్ నియోజకవర్గానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన అండర్-14 బాలబాలికల జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. ప్రారంభ మ్యాచ్‌ల్లో క్రీడాకారులు ప్రదర్శించిన నైపుణ్యం ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో క్రీడా భారతి నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# సిఐటియు 17 వ రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

### ఏప్రిల్ 17 కార్మిక ప్రదర్శన, బహిరంగసభను జయప్రదం చేయండి-సిఐటియు

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** నంద్యాలలో ఈనెల 17 18 19 తేదీల్లో జరిగే సిఐటియు 17వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏప్రిల్ 17వ తేదీ నంద్యాల పట్టణంలోఉదయం 10 గంవలకు కార్మిక మహా ప్రదర్శన 11 గంవలకు బహిరంగ సభ ఉంటుంది, ఈ ప్రదర్శన బహిరంగ సభలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి జే, మోహన్, అన్నారు, సి బెళగల్ లో సిఐటియు మండల కమిటీఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లునీ సిఐటియు డివిజన్ కార్యదర్శి జే, మోహన్, మండల నాయకులు ఖాజా హుస్సేన్, సుందర్ రాజు, రాముడులు ఆవిష్కరించి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను హక్కులను హరించి వేస్తూ, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి పనిచేస్తున్నదని,1926 నుండి పోరాడి సాధించుకున్న 29 రకాల చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చి ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేస్తున్న ఈ తరుణంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలో రాబోయే మూడు సంవత్సరాల పాటు కార్మికులు ఐక్యంగా సంఘటితమై కేంద్ర ప్రభుత్వ మెడలు వంచే విధంగా దిశ నిర్దేశం చేసే మహాసభ అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలో ఉన్న స్కీం వర్కర్లకు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచే విధంగా ఈ మహాసభలు విజయవంతం చేయాలని,ఒక్కొక్క కార్మికుడు ఒక్కొక్క అడుగు వేసి మహాశక్తిగా మారి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మిక శక్తి ఏమిటో తెలియజేయాలని పిలుపునిచ్చారు. అందుకే 17వ తేదీన నంద్యాలలో జరిగే మహా ప్రదర్శన బహిరంగ సభలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు, కార్యక్రమంలో అమాలి కార్మిక సంఘం నాయకులు. సోమప్ప, మాబు, శివ, వీరేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# 15న బనగానపల్లె లో మిమిక్రీ అండ్ మ్యాజిక్ షో

### ఎం ఎం 2 ప్రోగ్రాం కరపత్రికలను ఆవిష్కరించిన బిసి రాజారెడ్డి



**బనగానపల్లె ఏప్రిల్ 12నందిపత్రిక** 15వ తేదీన శ్రీ అరుణ భారతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మిమిక్రీ అండ్ మ్యాజిక్ షో ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షులు, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి తెలిపారు. బిసి గుర్రెడ్డి కాలనీలోని ప్రియదర్శిని స్కూల్ ఎదురుగా 15వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ మేరకు మిమిక్రీ అండ్ మ్యాజిక్ షో కు సంబంధించిన కరపత్రికలను బిసి రాజారెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఎం ఎం 2 కార్యక్రమానికి హైదరాబాద్ కు చెందిన ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ , కళారత్న అవార్డు గ్రహీత జీవిఎన్ రాజు, ప్రముఖ మెజీషియన్ అలి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆహుతులను అలరిస్తారని పేర్కొన్నారు. జీవిఎన్ రాజు నాలుగు దశాబ్దాల నుండి దేశ విదేశాలలో 6 వేలకు పైగా ప్రదర్శనలు, మెజీషియన్ అలీ 35 సంవత్సరాల కాలంలో దేశ విదేశాలలో 8 వేల ప్రదర్శనలు ఇచ్చారన్నారు. ముఖ్యంగా స్త్రీలకు ప్రత్యేక స్థలం కేటాయించడం జరిగిందన్నారు. ప్రజలందరూ కార్యక్రమానికి హాజరై మిమిక్రీ , మ్యాజిక్ షోను చూసి ఆనందించాలని కోరారు. కార్యక్రమంలో యనకండ్ల బిసి బాల తిమ్మారెడ్డి, బలరామయ్య, బొబ్బల మహేశ్వర్ రెడ్డి, జ్యోతిష్యం వెంకటరాముడు, మక్బుల్ హుస్సేన్, నుసి విష్ణువర్ధన్ రెడ్డి, టి ఎన్ ఆర్ గోపాల్ రెడ్డి బచ్చు భాస్కర్ పాల్గొన్నారు.

# ఆట.. వేట.. చివరకు కన్నీటి మూట!

### క్రికెట్ బెట్టింగ్ మాయాజాలంపై అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రత్యేక కథనం.



**మదనపల్లి, బ్యూరో చీఫ్ ఏప్రిల్ 12:నంది పత్రిక** అది ఒక మధ్యతరగతి గడప. ఆ ఇంట్లో పండుగ వాతావరణం ఉండాలి. కానీ, అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కారణం.. ఆ ఇంటి ఆశల దీపం, ఒక యువకుడు 'క్రికెట్ బెట్టింగ్' అనే మాయలో పడి తన జీవితాన్ని, తన తల్లిదండ్రుల పరువును పందెంగా పెట్టాడు. మొన్నటిదాకా ఫోన్ లో సిక్సర్ కొడితే చిందులేసిన ఆ యువకుడు, ఈరోజు అప్పుల వాళ్ల భయంతో ఎక్కడికో పారిపోయాడు. ఇది ఎక్కడో ఒకచోట ప్రతిరోజూ వినిపిస్తున్న మూగ రోదన.ఈ ఐపీఎల్ సీజన్ లో సరదా పేరుతో మొదలయ్యే ఈ 'బెట్టింగ్' వ్యసనం, చివరకు ఎలా ఒక మనిషిని నేరస్థుడిగా మారుస్తుందో అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి జిల్లా ప్రజలను అప్రమత్తం చేస్తూ కళ్లు తెరిపించే వాస్తవాలను వివరించారు.గతంలో జూదం అంటే వీధి చివరన రహస్యంగా ఆడేవారు. కానీ ఇప్పుడు మీ బిడ్డ చేతిలో ఉన్న సెల్‌ఫోనే ఒక ప్రమాదకరమైన జూదశాలగా మారింది.ఒక యాప్ డౌన్‌లోడ్ చేస్తారు. ఎవరో అపరిచితుడు పంపే లింక్ ద్వారా వందలు వేలు గెలుస్తారు. ఇదే బానిసను చేసే 'గాలం'.గెలిచిన డబ్బుతో విలాసాలకు అలవాటు పడతారు. ఒక్కసారి ఓడిపోగానే, ఆ డబ్బును తిరిగి సంపాదించాలనే కసితో తల్లిదండ్రుల నగలు, ఆస్తులు తాకట్టు పెడతారు.అప్పులు తీర్చలేక దొంగతనాలు, సైబర్ నేరాలు లేదా ఆత్మహత్యలకు పాల్పడతారు.మీ అబ్బాయి ఫోన్ లో ఏమి చూస్తున్నాడు? మ్యాచ్ జరుగుతున్నప్పుడు విపరీతమైన టెన్షన్ పడుతున్నాడా? అకస్మాత్తుగా డబ్బుల కోసం అబద్ధాలు చెబుతున్నాడా? అయితే అతను ప్రమాదంలో ఉన్నట్టే! "మీ పిల్లల చేతికి ఫోన్ ఇచ్చేముందు, అది వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతుందో లేక మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తుందో గమనించండి" అని ఎస్పీ హెచ్చరించారు. "యువతా..! మేము కేవలం మైదానంలోనే కాదు.. మీ ఫోన్ లోని డేటాలో కూడా నిఘా ఉంచాం" అని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లా సైబర్ క్రైమ్ విభాగం బెట్టింగ్ వెబ్‌సైట్లను, అక్రమ లావాదేవీలను నిరంతరం గమనిస్తోంది.బెట్టింగ్ కేసులో చిక్కుకుంటే క్రిమినల్ రికార్డు నమోదవుతుంది. దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగాలు రావు, విదేశాలకు వెళ్లే పాస్‌పోర్ట్ దొరకదు. చదువుకున్న చదువు బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.బుకీల మీద, వాట్సాప్ గ్రూపుల మీద నిరంతరం నిఘా ఉంచాం. నేరం రుజువైతే జైలు శిక్ష తప్పదు.

**యువతకు ఎస్పీ సూటి ప్రశ్న:**"ఒక్క నిమిషం ఆలోచించండి.. మీరు పందెం కాసే ప్రతి రూపాయి మీ తండ్రి చెమట చుక్క లేదా మీ తల్లి కళ్లలోని ఆశ. ఎవరో బుకీ మీ డబ్బుతో మేడలు కట్టుకుంటుంటే, మీరు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోవాలా? ఆటను ఆటలాగే చూడండి.. దాన్ని జీవితాన్ని చిన్నాభిన్నం చేసే జూదంగా మార్చకండి." అని ఎస్పీ యువతకు సందేశం ఇచ్చారు. జిల్లా ప్రజలారా..! మీ వీధిలో లేదా గ్రామంలో బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100/112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. మీ వివరాలు రహస్యంగా ఉంచబడతాయి.

# అక్కడక్కడ గుంతలు ఆదమరిస్తే అంతే సంగతులు..!



**మహానంది ఏప్రిల్ 12 (నంది పత్రిక):–** మహానంది మండలం బుక్కాపురం – తిమ్మాపురం ,తిమ్మాపురం – జమాలయ్య దర్గా, శ్రీనగరం గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. బుక్కాపురం నుంచి తిమ్మాపురం రహదారిలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థుల బస్సులు,రైతులు, వివిధ పనులకు నంద్యాలకు నిత్యం వందలాది వాహనదారులు ఈ రహదారి గుండానే రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు బాగు చేయాలని పలువురు వాహనదారులు,ప్రజలు కోరుతున్నారు.

## యువత సొంత వ్యాపారంలో రాణించాలి.. మంత్రి బీసి ఎంబియమ్ రెగ్జిన్ దుకాణాన్ని ప్రారంభించిన మంత్రి



**బనగానపల్లె ఏప్రిల్ 12 నందిపత్రిక** యువత తమ సొంత వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని, కూటమి ప్రభుత్వం కూడ యువతను ప్రోత్సహిస్తుందని ఆంధ్రప్రదేశ్ రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఎంబిఎం రెగ్జిన్ హౌస్ వ్యాపార సంస్థ అధినేత అత్తర్ మహబూబ్ మియా వారి కుమారులు అత్తార్ అన్ను, ఆసిఫ్ ల ఆహ్వానం మేరకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దుకాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బనగానపల్లె ప్రాంతం ప్రశాంతంగా ఉండడంతో వ్యాపార సంస్థలు విస్తరిస్తున్నాయని ఎక్కడైనా వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందాలంటే నాణ్యతతోనే సాధ్యమని ఇక్కడ నాణ్యత గల వస్తువులు అత్తార్ అన్ను ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో బురానుద్దీన్,జుబేర్, రఫీ, కరాటే బాషా,అత్తార్ కలాం,ఖాసీం బాబు, రాయలసీమ సలాం,అత్తార్ అర్షద్, జహీర్, సోహెల్, నాసిర్, షబ్బీర్, జియా తదితరులు పాల్గొన్నారు..

# ఆశా భోంస్లే మృతిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నివాళి




**విజయవాడ బ్యూరో చీఫ్ ఏప్రిల్ 12నంది పత్రిక** ప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే (92) తుది శ్వాస విడిచారు. నిన్న (శనివారం) సాయంత్రం ఆమె అస్వస్థతకు లోనయ్యారు. ఛాతిలో ఇన్ఫెక్షన్ సోకడంతో ఆమెను ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చేర్పించగా ఈరోజు (ఆదివారం) తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సినిమా రంగానికి ఆశా భోంస్లే చేసిన సేవలను కొనియాడారు.

**ఆశాభోంస్లే బహుముఖ ప్రజ్ఞాశాలి: సీఎం చంద్రబాబు**

ప్రముఖ గాయని ఆశాభోంస్లే మరణవార్త విని తీవ్రంగా విచారించానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఒక దిగ్గజ, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, భారతీయ గాయనిగా ఆమె పేరు సంపాదించారని కొనియాడారు. సంగీత పరిశ్రమకు ఆమె చేసిన అసాధారణమైన సేవలు ఏడు దశాబ్దాలకు పైగా విస్తరించి ఉన్నాయని తెలిపారు. ఆమె పాడిన పాటలు తరతరాలను సుసంపన్నం చేశాయని అన్నారు. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత అయిన ఆమె వారసత్వం భారతదేశ సంగీత వారసత్వంలో ఒక అంతర్భాగంగా నిలిచి, యుగయుగాల పాటు ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని చెప్పుకొచ్చారు. ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆశా భోంస్లే యువతను ఉర్రూతలూగించారు: పవన్ కల్యాణ్ప్రముఖ గాయని శ్రీమతి ఆశా భోంస్లే కన్నుమూశారని తెలిసి చింతించానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆశాజీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. మధుర గాయనిగా సుదీర్ఘ కాలం హిందీతోపాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ వంటి భాషల్లో సినీ గీతాలు ఆలపించారని కొనియాడారు. పాశ్చాత్య సంగీత శైలి గీతాలను ఆలపించి ఒక తరం యువతను ఉర్రూతలూగించారని అన్నారు. దమ్ మారో దమ్, చురా లియా హై తుమ్నే, ఇన్ అంకో కి మస్తీ, రాధా కైసే న జలే ఇలాంటి గీతాలతో సినీ, సంగీతాభిమానులను అలరించారని కీర్తించారు. తెలుగులో ఆశాజీ పాడిన గీతాలు తక్కువే అయినా హిందీ గీతాలతో తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితమేనని చెప్పారు. ఆశా భోంస్లే కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు..

## ప్రముఖ గాయని ఆశాభోస్లే (92) కన్నుమూత



**ముంబై బ్యూరో చీఫ్ ఏప్రిల్ 12నంది పత్రిక** ముంబై బ్రీచ్‌క్యాండీఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి.1933లో మహారాష్ట్రలోని సాంగ్లీలో జననం.ప్రముఖ గాయని లతా మంగేష్కర్‌కు ఆశాభోస్లే సోదరి.ఏడుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు కైవసం.రెండుసార్లు జాతీయ ఉత్తమ గాయని అవార్డులు.

2000 సంవత్సరంలో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు. 2008లో పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్న ఆశాభోస్లే.

## మోడల్ స్కూల్లో ప్రశాంతంగా ముగిసిన 6వ తరగతి ప్రవేశ పరీక్ష



**మహానంది ఏప్రిల్ 12 (నంది పత్రిక):–**మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో రామసుబ్బయ్య తెలిపారు.ఆదివారం మోడల్ స్కూల్లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.110 మంది విద్యార్థులకు గాను 108 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మణరావు,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీకృత రాజధాని సమగ్ర అభివృద్ధికి విరోధం రాయలసీమ విద్యావంతుల వేదిక కార్యదర్శి రత్నం యేసేపు



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** ఆదివారం 'రాయలసీమ విద్యావంతుల వేదిక' ఆధ్వర్యం లో స్థానిక యస్ టి యు ఉపాధ్యాయ భవన్ లో ' కేంద్రీకృత అమరావతి రాజధాని – వెనుకబడిన ప్రాంతాల నిర్లక్ష్యం– విభజన చట్టం లోనిరాయలసీమ హామీల ఉల్లంఘన " అనే అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది. వేదిక ప్రధాన కార్యదర్శి రత్నం ఏసేపు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈ . వెంకటేశు హాజరయ్యారు. ముందుగా రత్నం ఏసేపు మాట్లాడుతూ ప్రస్తుతం అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు కోస్తా ప్రాంతం లో కేంద్రీకృత రాజధాని వైపే మొగ్గుచూపుతున్నారని, చర్చలు మొత్తంగా అమరావతి, మావిగన్ చుట్టూ తిరుగుతున్నాయని, వెనుకబడిన ప్రాంతాల సమస్యలు, రాయలసీమ అభివృద్ధి కొరకు విభజన చట్టంలో ఇచ్చిన హామీల గురించి ఎవరూ మాట్లాడడం లేదని విమర్శించారు. ముఖ్య అతిధిగా హాజరైన ప్రొఫెసర్ ఈ . వెంకటేశు మాట్లాడుతూ వేల ఎకరాలలో, లక్షల కోట్ల రూపాయలతో నిర్మించాలని తలపెట్టిన అమరావతి రాజధాని కేవలం కొద్దిమంది కార్పొరేట్ ప్రయోజనాల కొరకు కోస్తా సంపన్నమైన ఒక వర్గం ప్రయోజనాలకే పరిమితం అవుతుందన్నారు. అది ఎప్పటికి సమగ్ర మైన అభివృద్ధి కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, అన్ని జిల్లాలలో నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీల ప్రకారం పెండింగ్ ప్రాజెక్ట్ లను పూర్తిచేయాలనీ, కర్నూలు లో హై కోర్టును ఏర్పాటు చేయాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ని ప్రభుత్వ రంగంలో స్థాపించాలని, రాయలసీమ కు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కొరకు ఇచ్చే ప్రత్యేక ప్యాకేజీ లను ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాయలసీమ ఉద్యమం కొత్త తరహా డిమాండ్లతో ముందుకు రావాలని, సామాజిక రాయలసీమ, సమగ్ర రాయలసీమ అనే నినాదాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీనియర్ న్యాయవాది వై. జయరాజు మాట్లాడుతూ కర్నూలు లో తక్షణమే హై కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ నాటి రౌండ్ టేబుల్ సమావేశంలో విజయ భాస్కర రెడ్డి, న్యాయవాది ఓంకార్, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణా రెడ్డి, విరసం భాద్యులు పాణి, రిటైర్డ్ ఇంజనీర్ రాముడు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ నాయకులు రజాక్ వలి, రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు హర్ష, రామ కృష్ణయ్య, యస్ డి పి ఐ నాయకులు చాంద్ బాష, డేవిడ్, ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక నాయకులు రామకృష్ణా రెడ్డి, పర్ల సుంకన్న, యోహాను హాజరై చర్చలో పాల్గొన్నారు.

## వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వివాహ నిచ్చితార్థ వేడుకకు మాజీ ఎమ్మెల్యే

**బనగానపల్లె ఏప్రిల్ 12నందిపత్రిక** బనగానపల్లె నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వివాహ నిచ్చితార్థ కార్యక్రమం ఆదివారం నంద్యాల పట్టణం పద్మావతి నగర్ బి 9 గ్రాండ్ హోటల్ లో జరిగింది మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు, యువజన నాయకుడు కాటసాని ఓబుళరెడ్డి కార్యక్రమానికి హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# దేవస్థానం ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం





**శ్రీశైలం ఏప్రిల్ 12 (నంది పత్రిక)** పరిపాలన అంశాలపై దేవస్థానం ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ విశ్రాంత ఫ్యాకల్టీమెంబర్ శ్రీ డి.శివ ప్రసాద్ , ఆయా అంశాల గురించి దేవస్థానం ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణా యొక్క ఆవశ్యకతను,లక్ష్యాలను వివరించారు , ఉద్యోగులు శిక్షణా పొందడం వల్లన ఎప్పటికప్పుడు మరింత సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉందన్నారు. శిక్షణా లో ఆయా అంశాల గురించి క్షుణ్ణంగా తెలుసునే అవకాశం ఉందన్నారు, రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతను ఉద్యోగులు అందిపుచ్చుకోవాలన్నారు. తర్వాత శిక్షకులు శ్రీ డి.శివ ప్రసాద్ రోజువారీ పరిపాలన అంశాలను వివరించారు, ముఖ్యంగా వారు ఉద్యోగుల ప్రవర్తన నియమావళి , క్రమశిక్షణ చర్యలు, ఫండమెంటల్ రూల్స్ , వేతనాల బిల్లు రూపొందించే విధానం, డిస్ట్రిక్ట్ ఆఫీస్ మ్యాన్యువల్ (జి.ా.వీ)ాా.= నిర్వహణ, మూవ్మెంట్ రిజిస్టర్ నిర్వహణ , మొదలగు అంశాల గురించి వివరించారు

అదేవిధంగా జ.జ.ూ రూల్స్ , ఆఫీస్ నోటింగ్, ఆఫీస్ డ్రాఫ్టింగ్ , మొదలగు అంశాల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధిపతులు, విభాగాల పర్యవేక్షకులు , సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు , రికార్డు అసిస్టెంట్లు , తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# మై టిడిపి యాప్‌లో నంద్యాల నియోజకవర్గ నెంబర్ 1 ర్యాంక్ మాభాష కు సైకిల్ బహుకరణ



## నంద్యాల మంత్రి క్యాంప్ కార్యాలయంలో మాభాష కు సైకిల్‌ను అందజేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 12 ( నంది పత్రిక )** తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు రూపొందించిన మై టిడిపి మొబైల్ యాప్ వినియోగంలో నంద్యాల 35వ వార్డు సలీంనగర్‌కు చెందిన టిడిపి నాయకుడు మాభాష విశేష ప్రతిభ కనబరిచారు. నంద్యాల నియోజకవర్గ స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచి నెంబర్ వన్ ర్యాంకు సాధించినందుకు గాను, టిడిపి కేంద్ర కార్యాలయం ఆయనకు ప్రోత్సాహక బహుమతిగా సైకిల్‌ను ప్రకటించింది. ఆదివారం నంద్యాలలోని మంత్రిగారి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మరియు నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గార్ల చేతుల మీదుగా మాభాష ఈ సైకిల్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా మాభాష మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మై టిడిపి యాప్ కీలక పాత్ర పోషిస్తోందని . నంద్యాల నియోజకవర్గ స్థాయిలో నెంబర్ వన్ ర్యాంకు సాధించడం, దానికి గుర్తింపుగా కేంద్ర కార్యాలయం నుండి సైకిల్‌ను మంత్రి ఫరూక్, యువ నాయకులు ఫిరోజ్ గార్ల చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో పార్టీ కోసం మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ , సలీంనగర్ టీడీపీ నాయకులు ఫరూక్, దేవ నగర్ ఖజా, హుస్సేన్, తోటరామయ్య స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని మా భాషను అభినందించారు.




# ఈనెల 13వ తేదీ సోమవారం యధావిధిగా పీజీఆర్ఎస్ మరియు రెవిన్యూ క్లినిక్ ల నిర్వహణ

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీ ఆర్ఎస్ ) మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు విస్తరణ



**ఏలూరు, బ్యూరో చీఫ్ ఏప్రిల్, 12: నంది పత్రిక** ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీర్స్ ) సేవలను ఈ నెల 13 వ తేదీ సోమవారం మండల, డివిజనల్ మరియు మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈనెల 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా పిజి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది.దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చు.అలాగే, ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: ప్త్రజూం://ఎవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే, 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు

# మార్కెట్ లో ఉన్న మొక్కజొన్నల కాంటాలు పూర్తి అయ్యాకే నూతన కొనుగోళ్లు: మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి.



**కేసముద్రం, ఏప్రిల్ 12(నంది పత్రిక)**:కేసముద్రం మార్కెట్ లో పేరుకుపోయిన మొక్కజొన్నలు పూర్తిగా కొనుగోలు చేసేంతవరకు రైతులు మార్కెట్ లోకి మొక్కజొన్నలు తేకూడదని మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి రైతులను కోరారు. యార్డులో ప్రస్తుతం 50 వేల బస్తాల వరకు మక్కలు పేరుకుపోయాయని, వీటి కొనుగోలు పూర్తి అయిన తర్వాత మక్కలు కొంటామని, అప్పటివరకు రైతులు మార్కెట్ యార్డుకు మక్కలు తేకూడదని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి తెలిపారు. కేసముద్రం మండల పరిధిలో ఉన్న రైతులు మాత్రమే మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రానికి మక్కలు తేవాలని, ఇతర మండలాల రైతులు ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని చైర్మన్ కోరారు. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సహకరించి తేమ 14 శాతం కంటే తక్కువగా ఉండేలా బాగా ఆరబెట్టి, శుభ్రం చేసి విక్రయానికి తేవాలని, ముందుగా శాంపిల్ తీసుకువచ్చి టోకెన్ తీసుకువెళ్లి తరువాత మక్కలను విక్రయానికి తేవాలని కోరారు. మార్కెట్లో ప్రస్తుతం ఉన్న మొక్కజొన్నల కాంటాలు పూర్తి చేసి ఎగుమతి చేసే కార్యక్రమాన్ని ఆదివారం ఎస్ఐ క్రాంతికిరణ్, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అమరలింగేశ్వర రావు తదితరులతో కలిసి పరిశీలించారు.

# రజతోత్సవ వేడుకల్లో పూర్వ విద్యార్థులు.

**కేసముద్రం, ఏప్రిల్ 12(నంది పత్రిక)**:కేసముద్రం పట్టణంలోని విసిబి ఫంక్షన్ హాల్ వేదికగా శ్రీవివేకానంద హైస్కూల్ లో 1999-2000 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల విద్యను పూర్తి చేసుకుని 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలు మధుర స్మృతుల మధ్య సాగాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ ఎడ్ల అశోక్ రెడ్డితో పాటు ఆనాటి గురువులు సతీష్ రెడ్డి, యాకయ్య, వీరారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎడ్ల అశోక్ రెడ్డి మాట్లాడుతూ పాతికేళ్ల తర్వాత విద్యార్థులంతా ఒకే చోట చేరి, పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి నేడు సమాజంలో వివిధ రంగాల్లో స్థిరపడటం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల మధ్య ఈ అనుబంధం ఇలాగే కొనసాగాలని, ఒకరికొకరు తోడుగా ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులంతా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి, పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. 25 ఏళ్ల క్రితం నాటి పాఠశాల ముచ్చట్లను, చిన్ననాటి అల్లరిని గుర్తుచేసుకుంటూ విద్యార్థులు ఉద్వేగానికి లోనయ్యారు. తమ ప్రస్తుత వృత్తి, ప్రవృత్తి గురించి ఒకరితో ఒకరు పంచుకున్నారు. మిత్రుల ఆటపాటలు, విందు వినోదాలతో రోజంతా కోలాహలంగా గడిపారు. ఈ కార్యక్రమంలో 1999-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆవుల యుగంధర్ యాదవ్, అల్లం నిరంజన్, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, గణపారపు రమేష్, మనోహర్ రెడ్డి, ఓంజీ, దేవా శంకర్, కోరళ్ల సుభాష్, సాగరిక, వర్ష, సృజన, హేమలత, తదితరులు పాల్గొన్నారు



# సిఐటియు 17 వ రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

## ఏప్రిల్ 17 కార్మిక ప్రదర్శన బహిరంగసభను జయప్రదం చేయండి-సిఐటియు



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** సిఐటియు 17వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏప్రిల్ 17వ తేదీ నంద్యాల పట్టణంలోఉదయం 10 గంవలకు కార్మిక మహా ప్రదర్శన 11 గంవలకు బహిరంగ సభ ఉంటుంది కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు న్యూ సిటీ కమిటి ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లునీ న్యూ సిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నగేష్ నరసింహులు కోశాధికారి సాయిబాబా, ఉపాధ్యక్షులు సుధాకరప్ప, ప్రభాకర్ కార్యదర్శి మహమ్మద్ రఫీ ఆవిష్కరించి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఏప్రిల్ 17వ తేదీ నంద్యాలలో జరిగే ప్రదర్శన,బహిరంగ సభలో సభాధ్యక్షులు వి.నాగేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్య అతిధి ఎలమరం కరీం సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి వక్తలు కె.హేమలత సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు, ఎం.సాయిబాబా సిఐటియు అఖిల భారత కోశాధికారి, సిహెచ్.నర్సింగరావు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.ఏ గఫూర్ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, కర్నూలు మాజీ శాసనసభ్యులు మరియు ఎ.నాగరాజు సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఒక్కొక్క కార్మికుడు ఒక్కొక్క అడుగు వేసి మహాశక్తిగా మారి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మిక శక్తి ఏమిటో తెలియజేయాలని పిలుపునిచ్చారు. 1926 నుండి పోరాడి సాధించుకున్న 29 రకాల చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చి ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేస్తున్న ఈ తరుణంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలో రాబోయే మూడు సంవత్సరాల పాటు కార్మికులు ఐక్యంగా సంఘటితమై కేంద్ర ప్రభుత్వ మెడలు వంచే విధంగా దిశ నిర్దేశం చేసే మహాసభ అని తెలిపారు. కావున కర్నూలు నగరంలోని కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని నంద్యాల పట్టణంలో జరుగు కార్మిక మహా ప్రదర్శన, బహిరంగ సభనీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ఆస్తి కోసం అన్నను కడతేర్చిన తమ్ముడు



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్12,నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.కృష్ణాపురంలో ఆస్తి వివాదం ఘోర హత్యకు దారితీసింది. ఎస్సీ కాలనీకి చెందిన ఏసేబుకు ఐదుగురు కుమారులు వారు ఆస్తి పంచుకునే విషయంలో కొంతకాలంగా తరచూ గొడవ పడుతూ ఉన్నారు. శనివారం రాత్రి కుటుంబంలో మరోసారి వాగ్వాదం చోటుచేసుకుంది. మాటల తగాదా ఘర్షణగా మారి, తమ్ముడు విజయరాజు ఆవేశంతో రోకలిబండతో అన్న దైవ భక్తుడు(40)పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన దైవ భక్తుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘర్షణను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో ఇద్దరు అన్నదమ్ములు కూడా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డకు తరలించారు. నిందితుడు విజయరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**ఈ నెల 13 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**

**జిల్లా,డివిజన్,మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**

**ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి ఉ.10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్**

**ఫోన్ చేయవలసిన ల్యాండ్ లైన్ నెం.08562-244437 - జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**డిఆర్ఓమల్లికార్జునుడు**

**వై ఎస్ ఆర్ కడప,బ్యూరో చీఫ్ ఏప్రిల్12:నంది పత్రిక** ఈ నెల 13 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించు కోవాలని డి ఆర్ ఓ మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకుసంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13 వతేదీన సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజాసమస్యలపరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అంద జేయాలన్నారు.అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పునుతీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని,అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలుపిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.లి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీ ఆర్ఎస్ )“ అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.లి అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారులి

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం:**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి ఉ.10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# నరసింహ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల మాజీ ఎమ్మెల్యే గంగుల నాని



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 12 నంది పత్రిక** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలక్ష్మీ నరసింహ స్వామిని మాజీ ఎమ్మెల్సీ వైకాపాకర్నూలు పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి వైకాపా భూమా కిషోర్ రెడ్డి, ఆళ్లగడ్డ మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి గోపాల్ రెడ్డి శంకర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న వారికి ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాలన్ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# నేటి నుంచే అరైవ్-అలైవ్-2026.

### ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం.
### రోడ్డు భద్రతపై ఎస్సై క్రాంతి కిరణ్ పిలుపు
### గ్రామాల్లో ప్రత్యేక రోడ్డు సేఫ్టీ కమిటీల ఏర్పాటు

**కేసముద్రం, ఏప్రిల్ 12(నంది పత్రిక):** ప్రమాదాలు జరిగినప్పుడు విలపించడం కంటే జరగకుండా జాగ్రత్త పడటమే విజ్ఞత అని కేసముద్రం ఎస్సై క్రాంతి కిరణ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు ఈ నెల 13 నుండి 18 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న అరైవ్ అలైవ్ -2026 కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎస్సై పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతంలోని రోడ్డు పరిస్థితులపై వాహనదారులను హెచ్చరించారు. కేసముద్రం మండలంలోని గ్రామీణ మార్గాలు ఎక్కువగా ఉంటాయి. రోడ్లు సరిగా లేకపోవడంతో పాటు, ఆకస్మికంగా రోడ్లపైకి జంతువులు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో అతివేగం ప్రాణాంతకంగా మారుతుంది. వాహనదారులు తమ వేగాన్ని నియంత్రించుకోవడంతో తమ ప్రాణాలను రక్షించుకున్న వారవుతారని ఎస్సై సూచించారు. పోలీసుల లక్ష్యం – మీ క్షేమం... చట్టం మిమ్మల్ని శిక్షించకముందే, ప్రమాదం మిమ్మల్ని హెచ్చరించకముందే మేల్కొందాం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుండెలకు హత్తుకోవాలని ఎస్సై కోరారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం అనేది పోలీసుల కోసం కాదని, మీ కోసం ఇంట్లో ఎదురుచూసే మీ కుటుంబ సభ్యుల కోసమని పిలుపునిచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు.. వారోత్సవాల నేపథ్యంలో నేటి నుండి కేసముద్రం మండల పరిధిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు ఎస్సై తెలిపారు. అదేవిదంగా నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

**గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమిటీల ఏర్పాటు...**

కేసముద్రం మండలంలోని 26 గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమిటీనీ ఏర్పాటు చేశామని ఎస్సై తెలిపారు. ఈ కమిటీలో సర్పంచ్, ఉపసర్పంచ్ తో పాటుగా విద్యావంతులైన యువకులను 8 మందితో కూడిన కమిటీ ఉంటుందని పేర్కొన్నారు. వీరు ఆయా గ్రామాల్లో ప్రమాదాలు జరుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వాహనదారులకు సూచనలు చేస్తారని ఎస్సై తెలిపారు.



# కాళేశ్వరం బ్యారేజ్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి.

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పరిధిలోని మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ల పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు గాను నీటిపారుదల రంగ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్ గా ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ కమిటీ వారానికి రెండు సార్లు సమావేశమయి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షలు నిర్వహిస్తుందన్నారు. అవసరమైతే స్వయంగా తాను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమావేశాల్లో పాల్గొని పురోగతిని సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు.

అంతేగాకుండా ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారి నియమించ నున్నట్లు ఆయన తెలిపారు.పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు గాను సంబంధిత అధికారులతో ఆదివారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,నీటిపారుదల శాఖా సలహాదారుడు ఆదిత్య దాస్ నాథ్,జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్,టన్నెల్ నిపుణులు పరిక్షిత్ మెహ్రా,ఇ. ఎన్.సి లు రమేష్ బాబు,శ్రీనివాస్ లతో పాటు సి.డబ్ల్యూ. పి.ఆర్.ఎస్ ఆదనపు డైరెక్టర్ సెల్వా బాలన్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (చీణూూ), విజిలెన్స్ కమిషన్ వంటి చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ మూడు నిర్మాణాల్లో సమస్యలు ఒకే విధంగా ఉన్నాయన్నారు.ఖూ×ూ మరమ్మతుల పూర్తి ప్రక్రియలో 2027, 2028 సంవత్సరాలను కీలకంగా పరిగణించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోనే అన్నారం, సుందిళ్ల పనులు పూర్తవుతాయని, అదే సమయంలో మేడిగడ్డను కొంత భాగన్నీ పూర్తి చేయగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



ముంబైలకు కొత్త డిజైన్ల బాధ్యతను

ప్రభుత్వం ఇప్పటికే డిజైన్ కన్సల్టెంట్‌గా ూఖీ= ఇండియాను ఎంపిక చేసి, ××ు ముంబైతో సంయుక్తంగా పని చేయాలని నిర్ణయించిందన్నారు. డిజైన్ బృందం రాత్రింబగళ్లు పనిచేసి వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.డిజైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, డిజైన్ సిద్ధమైన వెంటనే సెంట్రల్ వాటర్ కమిషన్ (జఔజ)కు ఆమోదం కోసం పంపాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

సెక్రటరీ పరిక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపులో ఉండాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కన్సల్టెంట్లకు ఆయన సూచించారు.డిజైన్ ప్రక్రియకు సంబంధించిన భూభౌతిక, భూసాంకేతిక, మట్టి, హైడ్రాలిక్ మోడలింగ్ వంటి అన్ని అధ్యయనాలు సమగ్రంగా నిర్వహించబడతాయని ఆయన తెలిపారు. అవసరమైన అన్ని పరీక్షలు, డేటా అత్యవసర ప్రాధాన్యంతో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

అత్యధిక ప్రాధాన్యం పుణెలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ (జభూ=ూ),ఈ పరీక్షలు, అధ్యయనాల బాధ్యత వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ,కాలేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యున్నత ప్రాధాన్యంగా పరిగణించాలన్నారు.ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కేంద్ర జల కమిషన్‌తో సమన్వయం చేసి అవసరమైన అనుమతులు పొందాలని ఆయన సూచించారు. జభూ=ూ సిబ్బంది 45 రోజుల పరీక్షల కాలంలో నిరంతరం ప్రాజెక్ట్ స్థలాల్లో ఉండాలని ఆదేశించారు.

**ఏజెన్సీలకు శిబిరాల పునఃప్రారంభం ఆదేశం**ఎల్ & టీ సహా అమలు సంస్థలు తమ క్యాంపులు, మెస్ సదుపాయాలు, లాజిస్టిక్స్‌ను తక్షణమే పునరుద్ధరించాలని ఆయన చెప్పారు. ఇంజినీర్లు, టెక్నీషియన్లు, రిగ్ ఆపరేటర్లకు వసతి, ఆహార సమస్యలు రాకుండా చూడాలని ఆయన సూచించారు.

ఇసుక తొలగింపు, ఉూ= (భూభౌతిక) పరీక్షలు, సైట్ సిద్ధం పనులు అన్ని ఏజెన్సీల పూర్తి సహకారంతో నిర్వహించబడతాయన్నారు. డిజైనర్లు, జభూ=ూ, శాఖ ఇంజినీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు కలిసి అన్ని పరీక్షలను ప్రత్యక్షంగా వీక్షించాలని, ప్రతి అంశాన్ని సక్రమంగా నమోదు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు.



### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ఈసారి ఎన్నడూలేని విధంగా వైభవంగా నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేపడుతోంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ వేడుకలను ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీకగా, సామాజిక న్యాయానికి నాంది పలికేలా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ఈ నెల 14న జరగబోయే జయంతి వేడుకల ఏర్పాట్లను ఈరోజు ఉదయం తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖల మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని "ఇందిరమ్మ రాజ్యం"లో సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం అనే మూడు సూత్రాల ఆధారంగా అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో 135వ అంబేద్కర్ జయంతిని చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అంబేద్కర్ వాదులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు,ఉద్యోగులు యువత పెద్ద సంఖ్యలో ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు విచ్చేసి నివాళులు అర్పించనున్న నేపథ్యంలో, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఈ జయంతి వేడుకలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రానున్నందున అందుకు తగ్గ ఏర్పాటు, మొబైల్ టాయిలెట్స్, ప్రత్యేక శానిటేషన్ బృందాలు, అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు, పార్కింగ్‌కు విస్తృత స్థలాల కేటాయింపు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, సీసీ కెమెరాలతో భద్రతా పర్యవేక్షణ వంటి అన్ని అంశాల్లో సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వం అదనంగా పలు చర్యలు చేపడుతోందన్నారు.. అంబేద్కర్ జీవిత విశేషాలు, భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, విద్యార్థులు, యువత కోసం 125 అడుగుల వద్ద సాంస్కృతిక, చైతన్య కార్యక్రమాలు,అలాగే అన్ని జిల్లాల్లో కూడా జయంతి వేడుకలు నిర్వహణ ఘనంగా నిర్వహించేలా తగిన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.అనంతరం మంత్రి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలందరూ సౌకర్యవంతంగా పాల్గొనేలా ప్రతి అంశంలో నాణ్యత, సమయపాలన పాటించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో "ఇందిరమ్మ రాజ్యం"లో అంబేద్కర్ చూపిన రాజ్యాంగ మార్గంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సమాన అవకాశాల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగారి ప్రీతం, ఎస్సీ అభివృద్ధి శాఖ ఎడి అధికారులు సి. శ్రీధర్, వీసీ అండ్ ఎండీ హనుమంత్ నాయక్, జేడి శ్రీనివాస్ రెడ్డి,ప్రవీణ్ కుమార్ రెడ్డి, రామారావు, జయంతి ఉత్సవాల కమిటీ కో-చైర్మన్లు దొమ్మాటి సుదర్శన్ బాబు, మహేందర్, అనిల్, రోజారాణి, గంటా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రజల భాగస్వామ్యంతో చారిత్రాత్మకంగా నిర్వహించి సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటిచెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు.



# ఏప్రిల్ 19న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష.



**కేసముద్రం, ఏప్రిల్ 12(నంది పత్రిక):** కల్వల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందడానికి ఆరవ తరగతి నుండి పదవ తరగతి చదువడానికి ఆన్ లైన్ లో అప్లై చేసుకున్న విద్యార్థులకి ఏప్రిల్ 19 ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పరిమి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కల్వల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పరిమి నవీన్ మాట్లాడుతూ ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను తెలంగాణఎంఎస్. సిజిజి.జిఓవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా పొందవచ్చన్నారు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే ముందు తమ ఆధార్ కార్డులతో హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.

# బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం.



**కేసముద్రం, ఏప్రిల్ 12(నంది పత్రిక):** కేసముద్రం మున్సిపల్ పరిధిలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆదివారం కేసముద్రం సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారుల సౌజన్యంతో, ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఆర్.రమేష్ రెడ్డి, ఆర్టిఏ సభ్యులు రావుల మురళిలు సంయుక్తంగా ప్రారంభించారు. ఆర్.రమేష్ రెడ్డి మాట్లాడుతూ కేసముద్రం బాస్కెట్ బాల్ క్రీడాకారుల పుట్టినిల్లని, ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి వివిధ ఉద్యోగాలలో స్థిరపడ్డారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని వర్ధమాన క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. ఆర్టిఏ మెంబర్ రావుల మురళి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం జూనియర్ క్రీడాకారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, ఎక్కువమంది ఈ శిబిరంలో పాల్గొని మంచి క్రీడా నైపుణ్యాలను పెంపొందించు కోవాలన్నారు. సీనియర్ క్రీడాకారుడు ఎన్.రవి మాట్లాడుతూ క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకొని మంచి క్రీడ నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఆగే రాము, రాంబాబు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కొమ్ము రాజేందర్, సీనియర్ క్రీడాకారులు ఏం.యాకయ్య, పి.యాకయ్య, ఎండి ఫరీద్, ఎన్.రవి, ఎం.వెంకన్న, ఎం.హరీష్, డాక్టర్ ఎన్.అశోక్, బి.రమేష్, ఎస్.వేణు, సిహెచ్.ఎలేందర్, ఎం.యాకయ్య, బిక్షపతి, ఆర్.రాజు, ఎన్.వెంకన్న, ఎస్.ప్రవీణ్, ఎం.సుధాకర్, రాకేష్, యశ్వంత్, సందీప్, పి.నాగరాజు, బధ్యా నాయక్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు 'కాగ్నిఛాంప్' ఇండియా స్కాలర్‌షిప్.

తెలంగాణ విద్యార్థులకు కాగ్నిటివ్‌స్కోర్.ఏఐ అనే అంకుర సంస్థ 'కాగ్నిఛాంప్' ఇండియా స్కాలర్‌షిప్ పేరుతో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తోందని సంస్థ వ్యవస్థాపకులు కీర్తికుమార్ జైన్, విక్రమ్‌సింగ్ నేగిఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల వయస్సు నుంచి 18 ఏళ్ల వయసున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని, ఈ నెల 26 వరకు తమ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ పరీక్ష మే 2 లేదా 3న ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవచ్చని.. ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల విద్యార్థులు రిజిస్ట్రేషన్ రుసుం కింద రూ.499 చెల్లించాల్సి ఉంటుందన్నారు. **ఏటా రూ.లక్ష వరకు.. విద్యార్థుల వయసు,** చదివే తరగతిని దృష్టిలో ఉంచుకుని... వారివారి స్థాయులకు తగిన పరీక్షనే నిర్వహిస్తాం. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఏటా రూ.లక్ష వరకు ఉపకార వేతనాన్ని అందిస్తాం' అని కీర్తికుమార్ జైన్, విక్రమ్‌సింగ్ నేగి వెల్లడించారు.

# నేటి హార్మోజ్ జలశంది

### ఒకనాటి హురుమంజి,
### హోరమంజి తెలుసుకుందాం.

ప్రస్తుతం వార్తల్లో ఉన్న హార్మోజ్ జలసంధి నే మన పూర్వీకులు, కవులు "హురుమంజి" లేదా "హోరమంజి" అని పిలిచేవారు. మన తెలుగు సాహిత్యం, ముఖ్యంగా విజయనగర సామ్రాజ్య కాలం నాటి కావ్యాలు, ఈ హురుమంజి నుండి జరిగిన వర్తకాన్ని చాలా గొప్పగా వర్ణించాయి. అక్కడి నుంచి మన సీమలకు (ఆంధ్రదేశానికి) ప్రధానంగా దిగుమతి అయ్యే వస్తువులు ఇవే:

1. హురుమంజి గుర్రాలు (అత్యంత ముఖ్యమైనవి): మధ్యయుగంలో మన రాజులకు, ముఖ్యంగా కాకతీయులకు, ఆ తర్వాత విజయనగర రాయలకు యుద్ధాలలో గెలవాలంటే మంచి జాతి గుర్రాలు కావాలి. అరేబియా మరియు పర్షియా (ఇప్పటి ఇరాన్) నుండి వచ్చే మేలుజాతి అశ్వాలు ఈ "హురుమంజి" రేవు నుండే ఓడల ద్వారా మన కోస్తా తీరానికి (మోటుపల్లి, మచిలీపట్నం, భత్కల్) వచ్చేవి. శ్రీకృష్ణదేవరాయలు తన "ఆముక్తమాల్యద" లో గుర్రాల వ్యాపారం గురించి రాస్తూ, "రేవులను అభివృద్ధి చేసి, హురుమంజి నుండి వచ్చే గుర్రాలు, ఏనుగులు శత్రువులకు దక్కకుండా మనకే దక్కేలా చూసుకోవాలి" అని రాజనీతిని బోధించారు. 2. సాహిత్యంలో ప్రస్తావన (శ్రీనాథుని హరవిలాసం): కవిసార్వభౌముడు శ్రీనాథుడు రాసిన "హరవిలాసం" లో అవచి తిప్పయ్య సెట్టి అనే గొప్ప వర్తకుడి గురించి వర్ణిస్తూ, అతను ఏ దేశం నుంచి ఏ వస్తువులు తెచ్చేవాడో ఒక సీస పద్యంలో అద్భుతంగా చెప్పాడు. అందులో హురుమంజి ప్రస్తావన ఉంది.

**"హురుమంజి సొగసు కైవడి బారువారముల్."** "అంటే, హురుమంజి నుంచి అందమైన, వేగంగా పరుగెత్తే గుర్రాలను (బారువారముల్) తెప్పించేవాడని అర్థం.

3. ఇతర వస్తువులు: గుర్రాలే కాకుండా, హురుమంజి నుండి ఈ క్రింది విలాసవంతమైన వస్తువులు కూడా వచ్చేవి:

ముత్యాలు (గ్రముతీశ్రీం): పర్షియన్ గల్ఫ్ (ద్శుంతీు/ుశీతీఎబఓ) ప్రాంతం ముత్యాలకు పెట్టింది పేరు. మన కవులు వీటిని "ఆణిముత్యాలు" అని వర్ణించేవారు.

పన్నీరు (=శీంవ ఔఃవతీ): పర్షియా నుండి సుగంధ ద్రవ్యాలు, ముఖ్యంగా గులాబీ అత్తరు (పన్నీరు) వచ్చేది.

ఖర్జూరం & డ్రై ఫ్రూట్స్: ఎండిన పండ్లు, బాదం, పిస్తా వంటివి.

పట్టు (ూఅశ్రీ/ఎవశ్రీజవ్): అక్కడి నుంచి నాణ్యమైన ముఖమల్ (ఎవశ్రీజవ్) వస్త్రాలు కూడా వచ్చేవి.

**ముగింపులో** కాబట్టి, హురుముంజి అంటే మన తెలుగు వారికి కేవలం ఒక చమురు రవాణా మార్గం మాత్రమే కాదు. ఒకప్పుడు మన రాజ్యాల సైనిక బలానికి (గుర్రాలు), రాణుల అలంకరణకు (ముత్యాలు, పన్నీరు) మూలకేంద్రం అదే. ఆనాటి మన వర్తకులు సముద్రం మీద ఆధిపత్యం చెలాయించి, అక్కడి నుండి సంపదను మన దేశానికి తెచ్చేవారు.

# పార్టీలు, పదవులు ఏవైనా ప్రజలకు సేవచేయడం ముఖ్యం.





## ఎంపీ ఈటల రాజేందర్.

మల్కాజిగిరి పార్లమెంట్ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో ఎమ్మెల్యే,ఎంపీ నిధులతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూపార్టీలు ఏవైనా కావచ్చు కానీ.. ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేటర్లుగా గెలిచిన తర్వాత ప్రజలకు సేవ చేసే కర్తవ్యమే ఉంటుంది తప్ప, వేరే పని చేసే ఆస్కారం ఉండదు. అంతిమ తీర్పరులు ప్రజలే కాబట్టి.. ఇవాళ రాఘవేంద్ర కాలనీలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే నిధులు తెచ్చి ఇచ్చిన, ఎంపీగా నేను నిధులు తెచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినా, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినా, మున్సిపాలిటీ ఇచ్చినా.. మీరు (ప్రజలు) కట్టిన పన్నులకు మేము కాపలాదారులము మాత్రమే."మేమే ఇస్తున్నాం, మేమే ఇస్తున్నాం" అని అనుకోవడానికి లేదు. మీ డబ్బులకు మేము కాపలాగా ఉంటూ ఇంత పని చేయిస్తాము తప్ప అంతకన్నా ఏమీ లేదు. ఎవరికి అవకాశం ఉంటే వారు చేస్తారు.ఈ కమ్యూనిటీ హాల్ కోసం మేము ఇచ్చిన నిధులకు, మీరు మరిన్ని పైసలు తోడు వేసి కట్టారు. ప్రభుత్వం చేసే పనికి తోడుగా మీ కాలనీ పెద్దలు అనేక రకాలుగా సపోర్ట్ చేసి, ఇంత గొప్పగా నిర్మాణం చేసుకున్నారు. అన్ని పనులు ప్రభుత్వమే చేసేటటువంటి కెపాసిటీ ఉండదు, చేయలేవు కూడా.కాలనీ అసోసియేషన్లు గాని, గేటెడ్ కమ్యూనిటీలు గాని, మిగతా సంఘాలు గాని, ఇట్లాంటి పెద్దలు వాటికి తోడ్పాటు అందిస్తుంటారు, వారికి ధన్యవాదాలు.లోకల్ సమస్యల గురించి చెప్పారు అభివృద్ధి, ఇది ఒక నిరంతర ప్రక్రియ (జశీ‌ఁఅఅబశీబం జూతీశీ‌ఎవం). ఉన్నంతలో వాటిని కూడా త్వరగానే పరిష్కారం చేసుకుందామని మనవి చేస్తూ మరొకసారి అందరికీ శు భాకాంక్షలు.అనంతరం మీడియాతో మాట్లాడుతూఒక మంచి కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే, నిధులతో పాటు, ఎంపీ నిధులతో పాటు, కమ్యూనిటీ వారు తమ సొంత డబ్బులను కూడా కలుపుకొని ఒక సుందరమైన ప్రాపర్టీగా నిర్మించుకున్నారు. ఈ కాలనీ పెద్దలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఎమ్మెల్యే వివేకానంద నాయకులు భరత్ సింహారెడ్డి,మల్లారెడ్డి గిరివర్ధన్,ఈ కాలనీ పెద్దలు, ప్రజల సమక్షంలో దీనిని అంకితం చేశాము.ఇక్కడ కొన్ని సమస్యలు మా దృష్టికి తెచ్చారు. తప్పకుండా ఎమ్మెల్యే,నేను కలిసి ఉన్నంతలో ఆ సమస్యలను కూడా పూర్తి చేస్తామని మనవి చేస్తున్నాను.ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం అయినా, మున్సిపాలిటీ అయినా, కేంద్ర ప్రభుత్వం అయినా అన్ని సమస్యలు పరిష్కరించే అంత కెపాసిటీ ఉండదు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే అవి సాధ్యమవుతాయి. ఇవాళ రాఘవేంద్ర కాలనీలో మేము ప్రభుత్వ పరమైన సపోర్ట్ చేసినప్పటికీ, వారు సొంత డబ్బులతో, ఆసక్తితో ఈ పని చేసుకున్నారు.

**నేను హైదరాబాద్‌లో చూస్తున్నాను**చాలా కాలనీలలో ప్రజలు ఎంత యాక్టివ్ గా ఐక్యంగా ఉంటారో హైదరాబాద్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో, వారి కాలనీలను గొప్పగా అభివృద్ధి చేయడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ పరంపర, ఈ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ మాజీ కార్పొరేటర్ చెరుకుపల్లి తార చంద్రారెడ్డి,జిల్లా కార్యదర్శి, చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి,జిల్లా అధ్యక్షులు డా.ఎస్. మల్లారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి,గిరివర్ధన్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుచింతల మాణిక్ రెడ్డి,గోపు రమణారెడ్డి,వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, పింగిలి వెంకట్ రెడ్డి,కట్ట కుమార్, రాఘవేంద్ర కాలనీ అధ్యక్షులు బి.వి.నారాయణ ప్రధాన కార్యదర్శి ఎ. ఉమాపతి రావు ఉపాధ్యక్షులు బి.సతీష్ కుమార్,జాయింట్ కార్యదర్శి యం. కోటేశ్వర రావు, ట్రెజరర్,యం. శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు, పి.వి. శ్రీనివాస్ కే. ఉపేంద్ర,కాలనీ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు.





## మంత్రి పొన్నం ప్రభాకర్.

చిగురుమామిడిలో రైతులకు వ్యవసాయ పనిముట్లు.యంత్రాల పంపిణీ రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలనీ, గ్రామ గ్రామానా పెద్ద ఎత్తున ఈ పంటను సాగు చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ పంట పండించడం ద్వారా రైతులు అధిక లాభాలు సాధించవచ్చని ఈ విషయంలో నేను గ్యారంటీ ఇస్తానని స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను మంత్రి రైతులకు పంపిణీ చేశారు. 24 మంది రైతులకు 40.80 లక్షల రూపాయల విలువైన అధునాతన వ్యవసాయ పనిముట్లను అందజేశారు. 15 రోటావేటర్లు, బెయిలర్లు, పవర్ స్ప్రేయర్లు, తదితర పరికరాలు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చిన్న గ్రామంలో 50 ఎకరాలు పెద్ద గ్రామంలో 100 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగును చేపట్టాలని సూచించారు. పెద్ద ఎత్తున ఈ పంటను సాగు చేయడం వల్ల మంచి లాభాలు పొందవచ్చని అంతర పంటలు కూడా వేసుకోవచ్చని తెలిపారు. అత్యధికంగా ఈ పంటను సాగు చేసే గ్రామాలను మరింత పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని చెప్పారు. నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫ్యాక్టరీని ఇటీవల ప్రారంభించుకున్నామని అక్కడ కొనుగోలు చేపడతారని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో అశ్వరావుపేట ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. వ్యవసాయ పనిముట్లు అవసరం ఉన్న రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల ద్వారా ప్రతిపాదనలు వచ్చిన వెంటనే అదనంగా పరికరాలు మంజూరు చేయించి రైతులకు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ తరుపున చాలా సంవత్సరాల తరువాత ప్రజా ప్రభుత్వంలో పనిముట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గడ్డి మోపులు కట్టే బేయిలర్లు ఎక్కువగా అవసరం ఉన్నాయని చెబుతున్నారు. వాటిని ఇప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఎక్కడా ఇబ్బందులు లేవని చెప్పారు. తాను కూడా ఆయిల్ ఫామ్ పంటను చేసేందుకు వ్యవసాయ భూమిని చూస్తున్నానని తెలిపారు. అనుకూలంగా దొరుకుతే పంటను సాగు చేస్తానని పేర్కొన్నారు. 5 ఎకరాల పైన ఉన్న వారు ఆయిల్ ఫాం సాగు చేయాలనీ కోరారు. ఆయిల్ ఫాం సాగు వల ప్రకృతి ఇబ్బందులు, కోతుల సమస్యతో పాటు ఏ ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. దానిపై నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ విజిట్ చేయాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సాగునీటి కాలువల నిర్మాణానికి అందరూ సహకరించాలని పేర్కొన్నారు. ఇటీవల గౌరవెల్లి ప్రాజెక్ట్ పై సమావేశం జరిగిందనీ. త్వరలోనే కాలువల పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే పేమెంట్ ఇప్పిస్తామని అందరూ కాలువల నిర్మాణానికి అవసరమైన భూములు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.. అదేవిధంగా కొత్తపెల్లి నుంచి హుస్నాబాద్ కు ఫోర్ లైన్ రోడ్ నిర్మాణ పనులకు అందరూ సహకరించాలని కోరారు. కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆలస్యం చేయకుండా వెంటవెంటనే అందిస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, ఆర్డిఓ కే మహేశ్వర్ సర్పంచ్ ఆకవరం భవానీ, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు , అధికారులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కోసం స్థల పరిశీలన చిగురుమామిడి మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధునాతన సౌకర్యాల తో 4 ఎకరాల విస్తీర్ణంలో 1-12 తరగతి వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను చేయనున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థలాన్ని పరిశీలించిన ట్లు చెప్పారు. పాఠశాల ప్రాంగణం లోనే ప్రైమరీ, హైస్కూల్, జూనియర్ కాలేజీ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థలానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్థలంపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్లో విద్యను అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.



## నేడు కాళోజీ కళాక్షేత్రంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రారంభం.



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హనుమకొండ మరియు వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయ్, డాక్టర్ సత్య శారద, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిధులు గా పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను డిసిపి సెంట్రల్ జోన్ ధార కవిత, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు నరసింహారావు, సత్యనారాయణ తదితర అధికారులు ఆదివారం ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యంగా ఈ "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని వివిధ వర్గాల ప్రజలతో నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి, ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా అధికారులు తెలిపారు.

సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే

ఈ కార్యక్రమంలో సర్పంచులు, వార్డు సభ్యులు, కార్పొరేటర్లు, ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు మరియు ఇతర వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ ఎన్డీఏ, ఎన్ఏ, సిడిఎస్ పరీక్ష.

యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ( ఎన్డీఏ ), నావల్ అకాడమీ (ఎన్ ఏ ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ( సిడిఎస్ )-2026 పరీక్షలు జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్షలు నిర్వహించగా, పింగిలి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో కమాండ్ డిఫెన్స్ సర్వీస్ పరీక్ష జరిగింది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో యూపిఎస్సి ద్వారా నిర్వహించిన పరీక్షా కేంద్రాలను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును, ఏర్పాట్లను పరిశీలించారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించిన రెండు పరీక్ష కేంద్రాలలో 754 మంది అభ్యర్థులకు గాను మొదటి పరీక్షలో 517 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా మధ్యాహ్నం 2 నుండి 4:30వరకు నిర్వహించిన రెండో పేపర్ పరీక్షకు 471 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. పింగిలి కళాశాలలో ఉదయం 9 నుండి 11 గంటల వరకునిర్వహించిన సిడిఎస్ పరీక్ష ఫస్ట్ సెషన్ కు 209 మందికి గాను 84 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. మధ్యాహ్నం 12:30 నుండి 2:30 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్ పరీక్షకు 88 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. నాలుగు నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన మూడో సెషన్ పరీక్షకు 103 మంది అభ్యర్థులకు గాను 40 మంది పరీక్ష రాశారని అధికారులు వెల్లడించారు.

## పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన.




సమాజ సేవా స్ఫూర్తి, పర్యావరణ పట్ల విద్యార్థులు తమ బాధ్యతను చాటి చెప్పారు. గ్లెండేల్ అకాడమీ ఇంటరాక్ట్ క్లబ్ విద్యార్థులు, లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ రోటరీ క్లబ్ మార్గదర్శకత్వంలో నగరంలోని పీరం చెరువు పరిసరాల శుభ్రత కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో చెరుకు 150 మీటర్ల పరిధిలో విద్యార్థులు బృందాలుగా విడిపోయి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ రాజు, కాగితం, చుట్టి, ఇతర రీసైకిల్ చేసే వర్గాలను వేరు చేసి శుభ్రపరిచారు. విద్యార్థులు శ్రమ ఫలితంగా సుమారు 120 కిలోల వ్యర్థ్యాన్ని సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. యువతలో పెరుగుతున్న పర్యావరణ అవగాహనకు ఈ కార్యక్రమం ప్రతీక నిలుస్తున్నదని వారు పేర్కొన్నారు.

## అమెరికా,ఇరాన్ శాంతి ప్రయత్నాల వైఫల్యం ప్రపంచానికి సంకేతాలు ఏమిటి...?

అమెరికా,ఇరాన్ సంబంధాలు గత నాలుగు దశాబ్దాలుగా సంక్షోభం, అనుమానం, వ్యూహాత్మక పోటీ అనే మూడు మూలస్థంభాలపై నిలిచాయి. ఇటీవల జరిగిన శాంతి ప్రయత్నాలు విఫలమవడం అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త అనిశ్చితికి దారి తీసింది. ఈ పరిణామంపై అంతర్జాతీయ మీడియా, మేధావులు, రాజకీయ విశ్లేషకులు విభిన్న కోణాల్లో స్పందిస్తున్నారు. ఈ విఫలత కేవలం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సమస్య మాత్రమే కాకుండా, ప్రపంచ శాంతి, ఆర్థిక వ్యవస్థ, భద్రతా వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపే అంశంగా మారింది.అమెరికా, ఇరాన్ మధ్య ప్రధాన విభేదం అణు కార్యక్రమం చుట్టూ తిరుగుతోంది. జాయింట్ కంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ (ఇరాన్ న్యూక్లియర్ ఒప్పందం 2015) ఒక పెద్ద మైలురాయి కాగా, డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 2018లో ఆ ఒప్పందం నుంచి తప్పుకోవడం వల్ల సంబంధాలు మళ్లీ ఉద్రిక్తమయ్యాయి. అంతర్జాతీయ మీడియా సంస్థలు, ముఖ్యంగా బీబీసీ న్యూస్, ది న్యూయార్క్ టైమ్స్ వంటి వేదికలు ఈ చర్యను "వ్యూహాత్మక తప్పిదం"గా విశ్లేషించాయి. వారి అభిప్రాయం ప్రకారం, అమెరికా ఒంటరితనానికి దారి తీస్తూ, ఇరాన్‌ను మరింత కఠిన వైఖరికి నెట్టింది. ప్రఖ్యాత మేధావి నోమ్ చోమ్స్కీ అభిప్రాయం ప్రకారం, అమెరికా విదేశాంగ విధానం తరచుగా శాంతి కంటే ఆధిపత్యాన్ని ముందుకు తీసుకెళ్తుంది. ఆయన విశ్లేషణలో, ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఇది అంతర్గత అస్థిరతను పెంచుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక గణాంకాల ప్రకారం, అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్ జీడీపీ 20182020 మధ్య సుమారు 67 పర్సెంట్ వరకు క్షీణించింది.రాజకీయ విశ్లేషకులు ఈ విఫల శాంతి ప్రయత్నాలను "మిస్డ్ అపార్చునిటీ"గా చూస్తున్నారు. ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్ నివేదిక ప్రకారం, అమెరికాఇరాన్ మధ్య నమ్మకం లోపం ప్రధాన అడ్డంకిగా మారింది. ఇరాన్ భావన ప్రకారం, అమెరికా ఒప్పందాలను నిలబెట్టుకోదు; అమెరికా దృష్టిలో, ఇరాన్ ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది. ఈ పరస్పర అనుమానం చర్చల విఫలానికి కారణమైంది.మధ్యప్రాచ్య రాజకీయాలలో ఈ విఫలత ప్రభావం తీవ్రమైంది. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా వంటి దేశాలు ఇరాన్ ప్రభావాన్ని తగ్గించేందుకు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ మీడియా విశ్లేషణలో, ఈ పరిణామం ప్రాంతీయ యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరికలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో చమురు సరఫరా అంతరాయం కలిగితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ప్రస్తుతం ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20 పర్సెంట్ హోర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతోంది. ఇంకా ఒక ముఖ్యమైన కోణం ... ప్రపంచ శక్తి సమీకరణం. చైనా, రష్యా వంటి దేశాలు ఈ పరిస్థితిని తమ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్‌తో చైనా చేసిన 25 సంవత్సరాల వ్యూహాత్మక ఒప్పందం (సుమారు 400 బిలియన్ డాలర్ల పెట్టుబడులు) .

# వందేళ్ళ పానశాల

దువ్వూరి రామిరెడ్డి జీవితంలో 1925, 1926 సంవత్సరాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. 1925లో ఆయన భార్య శేషమ్మ మరణించింది. 1926లో ఏడాది బిడ్డ కుమ్ముదమ్మ మరణించింది. ఈ విషాద స్మృతుల నుంచి మరో మలుపుగా ఆయన 1926లో పర్షియన్ కవి ఉమర్ ఖయ్యాం 'రుబాయి'లను 'పానశాల'గా అనువదించారు. ఈ 'పానశాల' కావ్యాన్ని అనేకమంది పండితులు రాతప్రతి గానే చదివి ప్రశంసించారు. తర్వాత 1928లో ఈ రచన ప్రథమంగా 'భారతి'లో ప్రచురితమైంది. వేనాడు రామచంద్రారెడ్డి నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ భూస్వామి, గొప్ప సాహిత్య పోషకులు. దువ్వూరి రామిరెడ్డి గారితో వారికి ఉన్న అనుబంధం తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. వేనాడు రామచంద్రారెడ్డి సాహిత్యం పట్ల ఎంతో మక్కువ కలిగిన వారు. ఆ రోజుల్లో నెల్లూరులో కవులకు, పండితులకు ఆయన ఇల్లు ఒక వేదికగా ఉండేది. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, కవులకు ప్రశాంతంగా రాసుకోవడానికి తగిన వసతులను కల్పించేవారు. దువ్వూరి రామిరెడ్డి పర్షియన్ కవి ఉమర్ ఖయ్యాం 'రుబాయిల'ను తెలుగులోకి అనువదించాలని సంకల్పించినప్పుడు, రామచంద్రారెడ్డి ఆయనను ఆహ్వానించి తన తోటలో అన్ని వసతులు కల్పించారు. నెల్లూరు శివార్లలో ఉన్న ఆ తోటలోని ప్రశాంత వాతావరణంలో కూర్చునే దువ్వూరి 'పానశాల' కావ్యాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. వేనాడు రామచంద్రారెడ్డి దువ్వూరి రామిరెడ్డికి కేవలం ఆశ్రయదాత మాత్రమే కాదు, వారిరువురూ అత్యంత సన్నిహిత మిత్రులు కూడా. దువ్వూరి ప్రతిభను గుర్తించి, రామచంద్రారెడ్డి ఆయనను నిరంతరం ప్రోత్సహించేవారు. తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప కావ్యం పురుడు పోసుకోవడానికి కారణమైన వ్యక్తిగా, ఒక ఉత్తమ సంస్కారవంతుడైన సాహిత్య అభిమానిగా వేనాడు రామచంద్రారెడ్డి పేరు సాహితీ చరిత్రలో నిలిచిపోయింది. దువ్వూరి రామిరెడ్డి తన 'పానశాల' పీఠికలో లేదా సందర్భానుసారంగా రామచంద్రారెడ్డి తోటలో ఆ కావ్యం రూపుదిద్దుకున్న తీరును, వారి ఆతిథ్యాన్ని స్మరించుకోవడం విశేషం. ఉమర్ ఖయ్యాం 'రుబాయిత్'ను తెలుగులోకి అనేకమంది అనువదించినప్పటికీ, దువ్వూరి 'పానశాల' అత్యంత ఆదరణ పొందింది. 'పానశాల' కావ్యం తెలుగు సాహిత్య లోకంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇందులోని భావాలు, వర్ణనలు పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఉమర్ ఖయ్యాం పన్నెండవ శతాబ్దంలో రాసిన 'రుబాయత్' (నాలుగు లైన్ల పద్యాలు) ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి. ఎడ్వర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్ వాటిని ఇంగ్లీష్‌లోకి అనువదించాక ఇవి ప్రపంచవ్యాప్తమయ్యాయి. తెలుగులో కూడా చాలామంది వీటిని అనువదించారు. అయితే, రామిరెడ్డి కేవలం అనువాదంగా కాకుండా, తెలుగుదనంతో కూడిన ఒక స్వతంత్ర కావ్యంగా దీనిని తీర్చిదిద్దాలనుకున్నారు. చాలామంది ఇంగ్లీష్ అనువాదాల ఆధారంగా పానశాలను రాస్తే, రామిరెడ్డి మాత్రం మూలాన్ని అర్థం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఇందుకోసం ఆయన పడ్డ శ్రమ సామాన్యమైనది కాదు: మూలంలోని భావాన్ని పట్టుకోవడం కోసం ఆయన ప్రత్యేకంగా పారశీక భాషను నేర్చుకున్నారు. ఫిట్జ్‌గెరాల్డ్ అనువాదాన్ని, ఉమర్ ఖయ్యాం మూల ప్రతుల్ని దగ్గర పెట్టుకుని ఏళ్ళ తరబడి అధ్యయనం చేశారు. ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా శ్రమించారు. పారశీక 'రుబాయీ'లకు సమానమైన భావాన్ని పండించడానికి తెలుగులో 'మత్తకోకిల' వృత్తాన్ని ఎంచుకున్నారు రామిరెడ్డి. ఆ నడకలో ఒక రకమైన తూగు, మత్తు ఉంటుంది. 'మధువు', 'పానశాల' వంటి పదాలను కేవలం మద్యంగా కాకుండా, వేదాంతపరమైన అర్థంతో అన్వయించడానికి ఆయన ఎంతో మేధామథనం చేశారు. నెల్లూరులో తన తోటలో కూర్చుని, ప్రకృతిని గమనిస్తూ ఒక్కో పద్యాన్ని ఆణిముత్యంలా చెక్కారు. పానశాల కేవలం తాగుబోతుల కోసం రాసింది కాదు. అది జీవితం అశాశ్వతత్వాన్ని, వర్తమాన క్షణాన్ని అనుభవించాలనే సందేశాన్ని ఇస్తుంది. "గడచినది గడచినది; రానున్నదెయ్యదో.. ఉన్నదీ క్షణమొక్కటే!" అనే లోతైన తాత్వికతను రామిరెడ్డి అత్యంత సరళంగా, సుమధురంగా అందించారు. పారశీక పరిమళాలను తెలుగు తోటలోకి తెచ్చి, మన సంస్కృతికి అద్దేలా రామిరెడ్డి చేసిన కృషి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అందుకే ఆయన్ని 'కవికోకిల' అని పిలుచుకోవడం సార్థకమైంది. సరిగ్గా ఈ ఏడాదితో వందేళ్లు పూర్తి చేసుకున్న పాఠశాల ఇప్పటికి 21 సార్లు ముద్రణ జరిగి తెలుగు సాహిత్యంలో మకుటం లేని కావ్యంగా స్థిర నివాసం ఏర్పరచుకుంది. పానశాల గేయాలను ఘంటసాల కూడా ఆలపించడం, రికార్డుల రూపంలో రావడంతో మరింత ప్రజాదరణ పొంది, సామాన్య ప్రజలకు చేరువై చిరస్థాయిగా నిలిచిపోయిందనటం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

"ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అని చలం 1940లో అన్నారు. "బాధలే నా కాస్త బంధు వర్గంబు

బీదతనంబే నా ప్రియమైన హక్కు లోకహితంబు నాలోచించు పనియే కఠినంబు విధి... దైవ ఘటితంబు నదియు" అని 1935 లోనే దువ్వూరు రామిరెడ్డి అన్నారు. నిజమైన కవి లక్షణం ఇదే. అందుకే ఆయన 'పానశాల' కీర్తి సాహితీ సీమలో శాశ్వత స్థానాన్ని చూరగొంది

# సహస్ర కలశాభిషేకం అంటే ఏమిటి...?

సహస్రకలశాభిషేకం అనేది తిరుమలలో ప్రతి బుధవారం ఉదయం జరిగే ఒక అత్యంత పవిత్రమైన సేవ. ఇది బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటామండపంలో నిర్వహించబడుతుంది. "సహస్ర" అంటే వెయ్యి, "కలశం" అంటే పాత్ర అంటే 1008 కలశాలతో స్వామివారికి అభిషేకం చేయడం. ఈ సేవలో ప్రధానంగా భోగశ్రీనివాస స్వామిని గర్భగుడి నుండి బయటకు తీసుకొచ్చి ఒక వేదికపై తూర్పు ముఖంగా ఉంచుతారు. అదే సమయంలో మలయప్ప స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా మరో వేదికపై ఉంచబడతారు. విష్వక్సేనుడు (శ్రీవారి సేనాధిపతి) వారికి ఎదురుగా ఉంచబడతాడు. ఇలా మూడు మూర్తులు ఒక అర్ధవృత్తాకారంలో దర్శనమిస్తాయి. ఇంకా ఒక వైపు 1008 వెండి కలశాలను వరుసగా అమర్చి వాటిలో పవిత్ర జలాన్ని నింపుతారు. ఈ జలంలో సుగంధ ద్రవ్యాలు కలిపి మంత్రాలతో పవిత్రం చేస్తారు. మామిడాకులు ఉంచి, వస్త్రంతో కప్పి ఆవాహన చేస్తారు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఉంది: భోగశ్రీనివాసునికి చేసే అభిషేకం గర్భగుడిలోని మూలవిరాట్ స్వామికి ఎలా చేరుతుంది? దీనికి "అనుసంధాన తోరణం" అనే పట్టు దారాన్ని ఉపయోగిస్తారు. ఈ దారం భోగశ్రీనివాసుని మరియు మూలమూర్తిని కలుపుతుంది. అందువల్ల అభిషేక సమయంలో కలశాలలోని పవిత్ర శక్తి ఆ దారంతో మూలవిరాట్‌కు చేరుతుందని విశ్వాసం. సేవ ప్రారంభంలో స్థల శుద్ధి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరుగుతాయి. తరువాత హోమం చేసి, పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు వంటి పంచామృతాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. ప్రతి దశలో స్వచ్ఛమైన నీటితో శుద్ధి చేస్తారు. కొబ్బరి నీటితో కూడా అభిషేకం జరుగుతుంది. చివరగా "సహస్రధార" అనే వెయ్యి రంధ్రాలున్న వెండి పాత్ర ద్వారా నీటిని జల్లుతూ అభిషేకం చేస్తారు. ఇది జడివానలా కనిపించి ఎంతో అద్భుతంగా ఉంటుంది. సేవ ముగిసిన తరువాత ఆ అభిషేక జలాన్ని భక్తులపై ప్రోక్షిస్తారు. ఈ సేవను దర్శించిన వారికి తేజస్సు, జ్ఞానం, శాంతి, పుణ్యం లభిస్తాయని నమ్మకం.

# ఎల్లుండి వరల్డ్ క్వాంటం డే... ఏపీలో నవశకం ప్రారంభం



భారత క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్రకు శ్రీకారం చుడుతోంది. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో రెండు కీలక క్వాంటం టెస్ట్ బెడ్లను ప్రారంభించనున్నారు. గన్నవరంలోని మేధా టవర్స్, రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ చరిత్రాత్మక ఘట్టంతో, దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా వస్తున్న ఈ కేంద్రాలతో రాష్ట్రంలో నూతన సాంకేతిక శకానికి నాంది పడనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు 1ఎస్, 1క్యూ పేర్లతో రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీలను ఆవిష్కరించనున్నారు. ఈ కేంద్రాల ద్వారా క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి, సర్టిఫై చేసే అత్యంత కీలకమైన సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి లభిస్తుంది. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మరో కేంద్రం ఏర్పాటవుతోంది. మైనస్ 273 డిగ్రీల సెంటీగ్రేడ్ అతిశీతల ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్లు, క్వాంటం ఉపకరణాల తయారీ, పరిశోధనలలో కీలకం కానున్నాయి. ముఖ్యంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీని 'ఓపెన్ యాక్సెస్' పద్ధతిలో అందుబాటులో ఉంచుతారు. దీనివల్ల క్వాంటం ఉపకరణాలు తయారు చేసే కంపెనీలు, పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఇది ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ రెండు క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలలో పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే వినియోగించడం విశేషం. మేధా టవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ '1క్యూ' పేరుతో టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేయగా, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో '1ఎస్' పేరుతో సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో మరో టెస్ట్ బెడ్‌ను నిర్మించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ), డీఆర్డీవో వంటి దేశంలోని అగ్రశ్రేణి సంస్థలు పూర్తి సహకారం అందించాయి. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ అధికారులు, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగంలో పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, ఇన్నోవేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి సుమారు 1.5 లక్షల మంది విద్యార్థులు వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది రాష్ట్ర యువతలో సాంకేతిక విద్య పట్ల ఆసక్తిని మరింత పెంచుతుందని భావిస్తున్నారు.

# భాషలో అసమానతను ఎలా సరిచేద్దాం?

భాష అనేది కేవలం భావ వినిమయ సాధనం మాత్రమే కాదు, అది ఒక సమాజపు సంస్కృతికి, విలువలకు అద్దం పడుతుంది. అలాంటి మన తెలుగు భాషలో పరిపూర్ణ విలువలు ఉన్నాయా?

**భాషలో అసమానతను ఎలా సరిచేద్దాం?** భాష అనేది కేవలం భావ వినిమయ సాధనం మాత్రమే కాదు, అది ఒక సమాజపు సంస్కృతికి, విలువలకు అద్దం పడుతుంది. అలాంటి మన తెలుగు భాషలో పరిపూర్ణ విలువలు ఉన్నాయా? ఎందరో దేశ విదేశీ భాషా పండితులు మెచ్చిన భాష మన తెలుగు. తెలుగు పదాల నుంచి వచ్చే శబ్దం సంగీతం లాగా ఉంటుందని అనేకమంది అన్యులు పొగిడిన భాష మనది. అలాంటి మన భాషలో ఒక దోషం వేల ఏళ్లుగా కొనసాగుతున్నది. వ్యాకరణంలోనే పొందుపరచబడ్డ 'లింగ వివక్ష' నేటి ఆధునిక ప్రజాస్వామ్య విలువలకు పూర్తి భిన్నమైనది. ఎందరో మెచ్చిన భాషకు అపకీర్తి మిగిల్చేదిగా ఉన్న ఈ వివక్షను ఇప్పటికైనా రూపుమాపాల్సిన బాధ్యత మనపై ఉంది. అసలు ఆ వివక్ష ఏమిటి? నామాలు, సర్వనామాలు, వాటితో కూడిన సమాపక క్రియల్లోని అక్షరాలను చూస్తే అది స్పష్టమవుతుంది. రాముడు వచ్చాడు సీత వచ్చింది. అతడు వచ్చాడు ఆమె వచ్చింది. వాడు వచ్చాడు అది వచ్చింది. వాడిని పొగిడారు దానిని పొగిడారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, పురుషుడికి తప్ప మిగిలిన అన్నిటికీ ఒకే సర్వనామం, ఒకే సమాపక క్రియను వాడటం. కుక్క వచ్చింది దానికి అన్నం పెట్టండి. బల్ల పడింది దానిని లేపండి. కవిత అచ్చయింది దానిని చదవండి. వాచీలో సమయం మారింది దానిని సరి చేయండి. దగ్గు వచ్చింది దానికి మందేయండి... ఈ ఉదాహరణలన్నింటిలో స్త్రీకి, జంతువుకు, వస్తువుకు, కళకు, కాలానికి, రోగానికి.. అన్నిటికీ 'అది/దాని' అనే సర్వనామం, 'ది' అనే సమాపక క్రియే ఉండటం మన తెలుగు భాషలోని గొప్ప లోపం. ఇది వేల ఏళ్ల నాడే భాషలో జొప్పించబడిన భూస్వామ్యపురుషాధిక్య కోణం. వాస్తవంగా కర్తను, కర్మను బట్టి చివరన వచ్చే క్రియల ద్వారా ఆయా లింగ భేదాలు తెలియాలి. కానీ తెలుగులో ఒక్క పురుషుడికి మాత్రమే ప్రత్యేక క్రియావాచకం ఉంది. అన్నింటికంటే అన్యాయం స్త్రీని వస్తువులతో, జంతువులతో జమ కట్టేయడం. వ్యాకరణ పరంగా చూస్తే వాడుఅది, అతడుఆమె, ఆయనఆవిడ అని ఉన్నా, 'అది' అనే సర్వనామాన్ని, 'వచ్చింది' అనే క్రియను స్త్రీకీ, జంతువుకూ, వస్తువుకూ కలిపి వాడటం అవమానకరం. వాడికి దెబ్బ తగిలింది (పురుషుడికి), దానికి దెబ్బ తగిలింది (స్త్రీకి), దానికి దెబ్బ తగిలింది (జంతువుకు). వాడిని కొట్టారు (అతడిని), దానిని కొట్టారు (ఆమెని), దానిని కొట్టారు (కుక్కని).. ఇలా! భాషాశాస్త్రపరంగా గౌరవంగా పిలిచే వాటిని మహద్వాచకాలు (మహత్తులు) అనీ, అగౌరవంగా పిలిచే వాటిని అమహద్వాచకాలు (అమహత్తులు) అనీ అంటారు. తెలుగులో పురుషులు/ దేవతలు మాత్రమే 'మహత్తులు' (సుపీరియర్), స్త్రీలు, జంతువులు, వస్తువులు 'అమహత్తులు' (ఇన్‌ఫీరియర్). స్త్రీలను అమహద్వాచకంగా చేర్చి, 'తిర్యక్కుల' (జంతువుల)తో సమానంగా 'వచ్చింది, పోయింది' అని సంబోధించడం ప్రాచీన పురుషస్వామ్య సమాజపు ఛాయలే. ఇది నేటి కాలానికి అప్రజాస్వామికం. ప్రపంచవ్యాప్తంగా అన్యభాషీయులు కూడా ఇది భాషాశాస్త్రపరంగా ఎత్తిచూపే విషయమే. మన పక్కనున్న ద్రవిడ భాషల్లో, ఉత్తరాది భాషల్లో స్త్రీకి ఉన్న క్రియా స్థానాన్ని పరిశీలిస్తే తెలుగులోని లోపం అర్థమవుతుంది. తమిళంలో స్త్రీని 'అమహత్తు'లో చేర్చలేదు. అక్కడ 'అవళ్ వందాల్' (ఆమె వచ్చింది) అని స్త్రీకి ప్రత్యేకమైన 'అల్' ప్రత్యయం ఉంది. జంతువు/వస్తువుకు 'అదు వందదు' (అది వచ్చింది) అని 'దు' వాడతారు. మలయాళంలో 'వన్ను' (వచ్చారు) అని అందరికీ సమానంగా వాడినా, సంబోధనలో స్త్రీకి ప్రత్యేక స్థానం ఉంటుంది. కన్నడలో పురుషుడికి 'బందను', స్త్రీకి 'బందలు' అని 'లు' ప్రత్యయం ఉండగా, జంతువుకు 'బంతు' అని స్పష్టమైన తేడా ఉంది. బెంగాలీలో అందరికీ ఒకే క్రియ ఉండటం వల్ల వివక్షే లేదు. హిందీలో వస్తువులకు లింగం ఉన్నా, స్త్రీకి 'వహ్ ఆయీ' అని ఇచ్చే గౌరవం వినడానికి అమహత్తుగా అనిపించదు. ఇక సంస్కృతంలో మూడు లింగాలు శాస్త్రీయంగా ఉంటాయి. అక్కడ క్రియ లింగం మీద కాక వచనం, పురుష మీద ఆధారపడుతుంది. 'రామః గచ్ఛతి', 'సీతా గచ్ఛతి' అని రెండింటికీ సమాన క్రియే ఉంటుంది. కానీ సర్వనామాల్లో 'సః' (వాడు), 'సా' (ఆమె), 'తత్' (అది) అని అత్యంత స్పష్టత ఉంటుంది. ఇటు మాతృక అయిన ద్రవిడ భాషల్లో లేనిది, అటు ప్రభావితం చేసిన సంస్కృతంలో లేనిది, తెలుగులో ఈ వివక్ష ఎలా ప్రవేశించింది? తెలుగులోనూ పూర్వం "ఆమె వచ్చింది" కంటే "ఆమె వచ్చెను" అనే మధ్యస్థ రూపాలు ఉండేవి. కానీ వాడుక భాషలో "వచ్చింది" అనేదే స్థిరపడిపోయింది. మన తెలుగు వ్యాకరణకర్తలు సంస్కృతాన్ని అనుసరించామని చెబుతూనే, స్త్రీల విషయంలో ఆ భాషలోని ఆ విశిష్టతను ఎందుకు విస్మరించారు? తెలుగు, గోండి వంటి 'మధ్య ద్రవిడ' భాషలు పరిణామం చెందే క్రమంలో జరిగిన 'జెండర్ న్యూట్రలైజేషన్' అనే సాంకేతిక పొరపాటు లింగవివక్షకు దారి తీసింది. "స్త్రీ శూద్రౌ నాధీయతావు" వంటి సూత్రాలు స్త్రీని విజ్ఞానానికి, గుర్తింపుకు దూరం చేశాయి. ఆ భావజాలమే వ్యాకరణంలో 'అమహత్తు' వర్గీకరణకు పునాది వేసింది. అంటే నన్నయ కాలంనాటికి వారసత్వంగా వచ్చిన రాచరిక పురుషస్వామ్య ధోరణులు స్త్రీని 'నపుంసక' వర్గంతో సమానంగా అమహత్తులో పడేశాయి. ఇప్పటికైనా ఈ దోషాన్ని సవరించాలి. మన భాషలో స్థిరపడిపోయిన స్త్రీ వివక్షను రూపుమాపాలి. ఆంగ్లంలో సైతం 'జెండర్ న్యూట్రల్' పదాల వాడకం పెరిగింది. ఉదాహరణకు: చైర్మన్ స్థానంలో చైర్‌పర్సన్ అని, మేన్ పవర్ స్థానంలో వర్క్ ఫోర్స్ అని, ఫైర్‌మేన్ స్థానంలో ఫైర్ ఫైటర్ అని, మేన్ కైండ్‌ని హ్యూమన్ అనీ మార్పులు జరుగుతున్నాయి. దీనిని సరిచేయడానికి మూడు మార్గాలున్నాయి. మొదటి మార్గం గౌరవ వాచకాలను సాధారణీకరించడం. అంటే స్త్రీలను ఎప్పుడూ బహువచనంతో 'ఆమె వచ్చారు' అని సంబోధించడం. అయితే చిన్న వాళ్ల గురించి చెప్పేప్పుడు ఇబ్బంది ఉంటుందేమో! ఇక రెండో మార్గం 'ఉభయలింగ' సంబోధన (జెండర్ న్యూట్రల్). తమిళం లేదా ఇంగ్లీష్ తరహాలో, లింగ భేదం లేకుండా అందరికీ ఒకే క్రియా పదాన్ని బహువచనం వాడటం. ఆయన వచ్చారు ఆమె వచ్చారు... ఇలా! ఇక మూడో మార్గం, పురుషులకు 'డు' (వచ్చాడు) ఉన్నట్లే, స్త్రీలకు 'ది' (వచ్చింది) ని ఖాయం చేసి, జంతువులకు, వస్తువులకు 'బి' అనే ప్రత్యేక ప్రత్యయాన్ని వాడటం. (టఠడఢలలోని 'డు' పురుషులకు, తథదధలలోని 'ది' స్త్రీలకు, పఫబభలలోని 'బి' వస్తువులకు, జంతువులకు వాడటం). ఉదాహరణకు: అతడు వచ్చాడు, ఆమె వచ్చింది, పిల్లి వచ్చింబి, బల్ల పడింబి. అలాగే బానికి (పిల్లికి) అన్నం పెట్టండి. బానిని (పుస్తకాన్ని) అరలో సర్దండి... ఇలాగ. ఈ 'బ'కార ప్రయోగం ద్వారా సంస్కృతంలోని 'తత్' (అది) వంటి ప్రత్యేక వర్గాన్ని సృష్టించి, సంస్కృత స్థాయి స్పష్టతను సాధించవచ్చు. ఈ ప్రయోగం మొదట్లో కొత్తగా ఉన్నా, నవ్వు వచ్చినా.. స్త్రీలకు, జంతువుతకు, వస్తువులకు మధ్య భాషాపరమైన వర్గీకరణ సౌలభ్యం, స్పష్టత పెరుగుతాయి. ముఖ్యంగా అసమానత పోతుంది. అయితే అలవాటయ్యే వరకు ఆచరణాత్మకంగా ఒక తరంపాటు దీనిపై అవగాహన కల్పించాలి. ముఖ్యంగా రాస్తూ పోతే.. చదివేవాళ్లు కూడా క్రమంగా అలవాటు చేసుకుంటారు. గ్రాంథికం నుంచి వ్యవహారిక భాష ఎలా పరిణామం చెందిందో మనకు తెలుసు. ఈ అర్ధ శతాబ్ద కాలంలోనే పత్రికలు, పాఠ్య పుస్తకాలలో సైతం ఎన్నో క్రియలు మారుతూ వచ్చాయి. పాఠ్య పుస్తకాలలో, "చేయవలయును" అని ఉండేది.

తర్వాత "చేయవలెను", "చేయవలె", "చేయాలి"గా మారింది. జంతువులు, వస్తువులకు ప్రత్యేకించే ఈ మార్పు కేవలం అక్షరం మార్పు కాదు, వేల ఏళ్ల చారిత్రక పొరపాటును సరిదిద్దే ప్రయత్నం. ఈ మార్పుతో స్త్రీకి గౌరవంలభించడంతోపాటు, మన భాష మరింత ఉన్నతం అవుతుంది.

# రేపు మహారాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో ఆశా భోంస్లే అంత్యక్రియలు

ప్రముఖ నేపథ్య గాయని, గానకోకిల ఆశా భోస్లే (92) కన్నుమూయడంతో భారతీయ సినీ పరిశ్రమ విషాదంలో మునిగిపోయింది. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఆమె తుదిశ్వాస విడిచారు. రేపు (ఏప్రిల్ 13) ఆమె అంత్యక్రియలను ముంబైలో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర మంత్రి అశీష్ షెలార్ ప్రకటించారు. ఆశా భోస్లే మరణంతో ఒక శకం ముగిసిందని, ఆమె సంగీతం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు ఆనందాన్ని పంచిందని ఆయన అన్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు లోయర్ పారెల్‌లోని ఆమె నివాసంలో అభిమానులు, ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచుతారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు జరుగుతాయని షెలార్ తెలిపారు. తీవ్రమైన ఆయాసం, ఛాతీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెను శనివారం సాయంత్రం ఆసుపత్రిలో చేర్పించారు. బహుళ అవయవాలు విఫలం (మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) కావడంతో ఆమె మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. 1933లో జన్మించిన ఆశా భోస్లే, కొన్ని దశాబ్దాల పాటు తన అద్భుతమైన గానంతో భారతీయ సంగీత ప్రపంచాన్ని ఏలారు. వేల సంఖ్యలో పాటలు పాడి, శాస్త్రీయ సంగీతం నుంచి పాప్ వరకు అన్ని ప్రక్రియల్లో తనదైన ముద్ర వేశారు. ఆమె మృతి పట్ల దేశవ్యాప్తంగా సంగీత, సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



# లాయర్ హరిప్రసాద్ హత్య కేసును ఛేదించిన పల్నాడు పోలీసులు... నిందితుల అరెస్ట్

పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించిన యువ న్యాయవాది శ్రీరామ హరిప్రసాద్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు పాల్పడింది మరెవరో కాదు, మృతుడి తోడల్లుడు, నరసరావుపేటలో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట కోటయ్య అని తేల్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు నిర్ధారించి, అతడిని, మరో నిందితుడిని అరెస్టు చేశారు. రక్షించాల్సిన పోలీసు సిబ్బందే ఈ హత్యలో ప్రధాన నిందితుడిగా తేలడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన శ్రీరామ హరిప్రసాద్ (37) ఒంగోలులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గత శుక్రవారం (ఏప్రిల్ 10) తెల్లవారుజామున చిలకలూరిపేట మండలం యడవల్లి సమీపంలో ఆయన మృతదేహం లభ్యమైంది. ఆయన స్కూటీ మృతదేహంపై పడి ఉండటంతో, తొలుత ఇది రోడ్డు ప్రమాదంగా అందరూ భావించారు. అయితే, ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు అనుమానాలు తలెత్తాయి. మృతుడి తల వెనుక భాగంలో బలమైన గాయం ఉండటంతో ఇది ప్రమాదం కాదని, హత్యేనని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. లోతుగా దర్యాప్తు చేపట్టగా, హత్యకు ముందు నిందితులు మద్యం కొనుగోలు చేసినప్పుడు జరిపిన ఒక ఫోన్‌పే లావాదేవీ కీలక ఆధారంగా మారింది. ఈ ట్రాన్సాక్షన్ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు.

మృతుడు హరిప్రసాద్ భార్య, నిందితుడు కానిస్టేబుల్ వెంకట కోటయ్య భార్య అక్కాచెల్లెళ్ల కూతుళ్లు. హరిప్రసాద్ తరచూ మద్యం తాగి తనను వేధిస్తున్నాడని నాగజ్యోతి తన సోదరి భర్త వెంకట కోటయ్యతో చెప్పుకుని బాధపడేది. తన మరదలి కష్టాలు చూడలేక, హరిప్రసాద్‌ను అడ్డు తొలగించాలని కానిస్టేబుల్ కోటయ్య నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం తన స్నేహితుడైన శ్రీనివాసరావుతో కలిసి పక్కా ప్రణాళిక రచించాడు. గురువారం రాత్రి 'పార్టీ చేసుకుందాం రా' అని నమ్మించి హరిప్రసాద్‌ను నరసరావుపేటకు పిలిపించారు. కోటప్పకొండ రోడ్డులోని ఓ హోటల్‌లో ముగ్గురూ కలిసి అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. హరిప్రసాద్‌కు పూర్తిగా మత్తు ఎక్కాక, యడవల్లి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ బండరాయితో తలపై బలంగా మోది దారుణంగా హత్య చేశారు. అనంతరం దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంపై స్కూటీని పడేశారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com